



# నేటి దిక్సూచి

తెలుగు దిన పత్రిక

TGTEL/25/A31






ప్రచురణ. రంగారెడ్డి, సంపుటి:01 సంచిక :165 ఎడిటర్ పి. అలివేలు పేజీలు : 04, వెల. 2రూ/ ఆదివారం- 12 - జూలై- 2026

## వియత్నాంలో మునిగిన భారత పర్యాటకుల బోటు- గల్లంతైనవారిలో ఏపీ, తెలంగాణ టూరిస్టులు- 15 మంది మృతి

2



- వియత్నాంలో భారీ విషాదం
- పర్యటకులతో వెళ్తున్న బోటు మునక- పలువురు గల్లంతు

అమరావతి : వియత్నాంలో భారీ విషాదం జరిగింది. భారత టూరిస్టులు ప్రయాణిస్తున్న బోటు ఒకటి నీట మునిగింది. ఈ ప్రమాదంలో పర్యాటకులు గల్లంతయ్యారు. వియత్నాంలోని ఫు క్వ్యాక్ ద్వీపం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఇందులో తెలుగువారు కూడా ఉన్నారు. ఈ మేరకు వియత్నాం హనోయిలోని భారత రాయబార కార్యాలయం తెలిపింది. ప్రమాదం గురించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని ఎక్స్ లో పోస్టు షేర్ చేసింది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 15 మంది చనిపోయినట్లు తెలుస్తోంది. అందులో తెలుగువారు కూడా ఉన్నారు. అలాగే తీవ్ర అస్వస్థతకు గురైన మరో 21 మంది ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## మళ్లీ కలుద్దాం సియోల్‘

# ముగిసిన నారా లోకేశ్ దక్షిణ కొరియా పర్యటన

- ముగిసిన నారా లోకేశ్ దక్షిణ కొరియా పర్యటన
- 50కి పైగా కార్పొరేట్ సంస్థలను రాష్ట్రంలోకి ఆహ్వానించిన మంత్రి లోకేశ్
- ఎక్స్ ద్వారా కృతజ్ఞతలు తెలిపిన ఐటీ శాఖ మంత్రి



అమరావతి : దక్షిణ కొరియాలో మంత్రి నారా లోకేశ్ వారం రోజుల పర్యటన ముగిసింది. పర్యటన విజయవంతం కావటం పట్ల లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. వారం రోజుల పర్యటన ఎన్నో చర్చలు, భాగస్వామ్యాలతో భవిష్యత్తు కోసం ఉమ్మడి దార్శనికతతో విజయవంతంగా ముగిసిందని తెలిపారు. కొరియన్ల అసలైన స్ఫూర్తికి తగ్గట్టుగా, ప్రతి పనిని ‘పల్లి పల్లి‘ అంటూ అంటే ఎంతో వేగంగా, స్పష్టమైన లక్ష్యంతో ముందుకు తీసుకెళ్లామన్నారు. ప్రతి సమావేశం విజయవంతం కావడానికి సహకరించిన రిపబ్లిక్ ఆఫ్ కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖకు, సియోల్‌లోని భారత రాయబార కార్యాలయానికి, ఏపీ ఈడీబీ బృందానికి సామాజిక మాధ్యమాల ద్వారా కృతజ్ఞతలు తెలిపారు. మళ్లీ కలుద్దాం సియోల్ అంటూ లోకేశ్ ఎక్స్ లో పోస్ట్ చేశారు. రోడ్ షోతో ముగిసిన పర్యటన : ఈనెల 5 నుంచి 11 వరకు నిర్వహించిన అధికారిక పర్యటనలో 50కి పైగా కార్పొరేట్ సంస్థలను కలిసి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా లోకేశ్ కోరారు. తొలిరోజు సియోల్‌లో తెలుగు ప్రజలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంతో ప్రారంభమైన పర్యటన, సీఐఐ ఆధ్వర్యంలో పెట్టుబడిదారులతో మిగతా..2లో

## సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో

# మున్సిపల్ ఎన్నికలు



- సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ పేర్కొన్నారు.
- ఈ ఎన్నికలు జరపడానికి సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలిపారు.

పశ్చిమగోదావరి జిల్లా., జులై 11 : సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో మున్సిపల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఈ ఎన్నికలు జరపడానికి సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తెలిపారు. ఈరోజు (శనివారం) పశ్చిమగోదావరి జిల్లాలోని నర్సాపురంలో మంత్రి నారాయణ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మిగతా..2లో

## విమానం గాల్లో ఉండగా ఊడిన కిటికీ నుంచి కిందకు పడిపోతున్న ప్రయాణికుడిని కాపాడిన తోటి ప్రయాణికులు

2



గాల్లో ప్రయాణిస్తున్న ర్యాన్‌ఎయిర్ విమానం కిటికీ ఊడిపోవడంతో, ఆ కిటికీ పక్కనే కూర్చున్న ప్రయాణికుడు బయటకు పడిపోయే ప్రమాదం నుంచి తోటి ప్రయాణికులు కాపాడారు. విమానం గాల్లోకి ఎగిరిన 10 నిమిషాలకే హఠాత్తుగా 9,000 అడుగుల ఎత్తు నుంచి కిందకు దిగిపోయినట్టు ఫ్లైట్ ట్రాకింగ్ డేటా చెబుతోంది. ఆ సమయంలో ‘ఏదో పేలుడు జరిగినట్టు‘ శబ్దం వినిపించిందని ప్రయాణికులు స్థానిక మీడియాతో చెప్పారు. 61 ఏళ్ల సెర్బియా ప్రయాణికుడికి రాపిడి వల్ల గాయాలయ్యాయని, చికిత్స పొందుతున్నారని గ్రీస్‌లోని ఓ ఆస్పత్రి అధికారి మిచాలిస్ గియానాకోస్ తెలిపారు. “ఆయన బయటకు పడిపోకుండా, ఆయన భార్య సుమారు

## మోదీ ఎందుకు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు పెట్టరు?..

# న్యూజిలాండ్ జర్నలిస్ట్ ప్రశ్న

- ప్రధాని నరేంద్ర మోదీ పొలిటికల్ కమ్యూనికేషన్ స్టైల్‌పై అంతర్జాతీయ మీడియా నుంచి ఆసక్తికర ప్రశ్న ఎదురైంది.
- ఓ స్థానిక జర్నలిస్ట్ నేరుగా దౌత్యవేత్తలను ఉద్దేశించి ప్రధాని మోదీ మీడియా సమావేశాలు ఎందుకు నిర్వహించరు? అని ప్రశ్నించారు.



ఆక్లాండ్ (న్యూజిలాండ్)జులై 11: ప్రస్తుతం మూడు దేశాల పర్యటనలో భాగంగా న్యూజిలాండ్‌లో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీ పొలిటికల్ కమ్యూనికేషన్ స్టైల్‌పై అంతర్జాతీయ మీడియా నుంచి ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. భారత రాయబార కార్యాలయ అధికారులతో జరిగిన ఓ ముఖాముఖి సమావేశంలో, ఓ స్థానిక జర్నలిస్ట్ నేరుగా దౌత్యవేత్తలను ఉద్దేశించి ‘ప్రధాని మోదీ మీడియా సమావేశాలు ఎందుకు నిర్వహించరు?‘ అని ప్రశ్నించారు. దీనికి భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ) సీనియర్ అధికారి, ప్రముఖ దౌత్యవేత్త రుద్రేంద్ర టాండన్ అత్యంత చాకచక్యంగా స్పష్టమైన సమాధానమిచ్చారు. మిగతా..2లో

## వియత్నాం బోటు ప్రమాదంలో భారతీయుల మృతి...

# ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి

- వియత్నాంలో భారత పర్యాటకుల బోటు బోల్తా
- ప్రమాదంలో 15 మంది దుర్మరణం, 21 మందికి అస్వస్థత
- ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి
- సహాయం కోసం రంగంలోకి దిగిన భారత రాయబార కార్యాలయం
- బాధితుల కోసం కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు



ఢిల్లీ : వియత్నాంలో భారత పర్యాటకులతో వెళుతున్న ఒక బోటు బోల్తా పడిన ఘటనలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఈ దుర్ఘటనలో 15 మంది భారతీయులు మరణించగా, 21 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. వియత్నాంలోని ఫు క్వోక్ ద్వీపం సమీపంలో శనివారం ఈ ప్రమాదం జరిగింది. స్థానిక మీడియా కథనాల ప్రకారం, 32 మంది భారత పర్యాటకులు, ఒక ఫ్లైట్ అటెండెంట్, నలుగురు సిబ్బందితో మిగతా..2లో

## తిరుమలకు పోటెత్తిన భక్తులు... శ్రీవారి దర్శనానికి 30 గంటల సమయం



- తిరుమల కొండపై విపరీతమైన రద్దీ
- వారాంతం కావడంతో పెరిగిన భక్తుల తాకిడి
- వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లు దాటిన క్యూలైన్లు
- నిన్న ఒక్కరోజే రూ. 4.26 కోట్ల హుండీ ఆదాయం

అమరావతి : తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. వారాంతం కావడంతో కొండపై విపరీతమైన రద్దీ నెలకొంది. శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు దాదాపు 24 నుంచి 30 గంటల పాటు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సామాన్య భక్తులతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. మిగతా..2లో

## ఈ నెల 14న తెలంగాణ వ్యాప్తంగా కళాశాలల బంద్ కు పిలుపునిచ్చిన ఏబీవీపీ



- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విషయంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందన్న ఏబీవీపీ
- వీటిపై ఆధారపడి 20 లక్షల మంది విద్యార్థులు చదుకుంటున్నారని వెల్లడి
- ప్రభుత్వం, ప్రైవేట్ కాలేజీలు కలిసి విద్యార్థులను మోసం చేస్తున్నాయని మండిపాటు

హైదరాబాద్: ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపై తెలంగాణ ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని ఏబీవీపీ విమర్శించింది. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లలో జరుగుతున్న ఆలస్యాలను నిరసిస్తూ మిగతా..2లో

## రంగారెడ్డి జిల్లా హత్యలపై మంత్రి సీతక్క దిగ్భ్రాంతి.. కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

2



- షాబాద్, దైవాలగూడ ప్రాంతాల్లో ఆరుగురిని హత్య చేసిన రాజ్ కుమార్
- తనపై పోక్సో కేసు పెట్టి జైలుకు పంపించారని కక్ష
- బెయిల్ పై బయటకు వచ్చిన వెంటనే హత్యలు చేసిన వైనం

హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా షాబాద్, దైవాలగూడ ప్రాంతాల్లో జరిగిన ఘోర హత్యల ఘటనపై రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాజస్థాన్ పర్యటనలో ఉన్న మంత్రి, ఘటన వివరాలు తెలియగానే సంబంధిత పోలీస్ కమిషనర్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి సమాచారం సేకరించారు. నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని, కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీసు అధికారులను మంత్రి ఆదేశించారు.

## సీఎం రేవంత్ ను కలిసిన

# ఎమిరేట్స్ విమాన సంస్థ వైస్ ప్రెసిడెంట్

- రేవంత్ ను మర్యాదపూర్వకంగా కలిసిన మహమ్మద్ సార్ధన్
- రాష్ట్రానికి ఎమిరేట్స్ సేవలను పెంచాలని కోరిన రేవంత్
- రాష్ట్రానికి రెండు కొత్త విమానాశ్రయాలు వస్తున్నాయని చెప్పిన సీఎం



హైదరాబాద్: ప్రముఖ అంతర్జాతీయ విమానయాన సంస్థ ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్ధన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమిరేట్స్ వైమానిక సంస్థ 25వ వార్షికోత్సవాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జూబ్లీహిల్స్‌లో ఈ భేటీ జరిగింది. తెలంగాణలో రెండు కొత్త విమానాశ్రయాల నిర్మాణం జరగబోతోందని... రాష్ట్రానికి ఎమిరేట్స్ విమాన సర్వీసులను మరింత పెంచాలని ఈ సందర్భంగా సార్ధన్ ను రేవంత్ రెడ్డి కోరారు. దీంతో, హైదరాబాద్‌కు ఏ-380 విమాన సర్వీసులు ప్రారంభించేందుకు ఎమిరేట్స్ సంస్థ ఆసక్తి చూపించింది. ఎమిరేట్స్‌కు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. అంతేకాకుండా గచ్చిబౌలి స్పోర్ట్స్ యూనివర్సిటీకి స్పాన్సర్‌షిప్ అందించాలని రేవంత్ రెడ్డి కోరగా, ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్ సానుకూలంగా స్పందించారు. త్వరలో తెలంగాణలో వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో కొత్త విమానాశ్రయాలను నిర్మించబోతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే విమాన సర్వీసులు పెంచాలని ఎమిరేట్స్ ను రేవంత్ కోరారు.

## రైతాంగాన్ని రేవంత్ నిలువునా

# ముంచేస్తున్నారు



- మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూయకుండానే కన్నెపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేయవచ్చన్న కేటీఆర్
- 100 రోజుల్లో 200 టీఎంసీల నీటిని ఎత్తిపోయవచ్చని వ్యాఖ్య
- కాళేశ్వరంను బద్నాం చేయాలనే కుట్రతోనే నీళ్లు ఇవ్వడం లేదని ఆరోపణ

హైదరాబాద్ : తెలంగాణలో సాగునీటి సంక్షోభం, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి ఎత్తిపోతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశం నిర్వహించిన కేటీఆర్ మాట్లాడుతూ..

రాజకీయ కక్షతో సీఎం రేవంత్ రెడ్డి రైతాంగాన్ని నిలువునా ముంచేస్తున్నారని మండిపడ్డారు.

రిటైర్డ్ ఇంజనీర్ల ఫోరం ఇచ్చిన నివేదికను చూసి సీఎం సోయి తెచ్చుకోవాలని అన్నారు.

మొదటి పేజి తరువాయి

## తిరుమలకు పోటెత్తిన భక్తులు...
# శ్రీవారి దర్శనానికి 30 గంటల సమయం

39,690 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. శ్రీవారి హుండీ ద్వారా రూ. 4.26 కోట్ల ఆదాయం లభించగా, 4.09 లక్షల లడ్డూలను విక్రయించారు. దాదాపు 2.98 లక్షల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. వైద్య కేంద్రాల్లో 3,899 మందికి చికిత్స అందించినట్లు టీటీడీ వెల్లడించింది.

# రైతాంగాన్ని రేవంత్ నిలువునా ముంచేస్తున్నారు

మేడిగడ్డ బ్యారేజ్ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయవచ్చని ఘోరం సూచించిందని తెలిపారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద 96.79 మీటర్ల నీటి ప్రవాహం ఉందని చెప్పారు. 94 మీటర్ల లభ్యత వద్దే పంపులు ఆన్ చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారన్నారని... ఈ లెక్కన నీటిని పంప్ చేయవచ్చని అన్నారు. ఎల్ నినో ప్రభావం ఉన్నా ఈ ప్రవాహం మరో 100 రోజులు కొనసాగుతుందని... రోజుకు 2 టీఎంసీల చొప్పున 200 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తే గోదావరి బేసిన్‌లోని అన్ని జలాశయాలను నింపి తెలంగాణను సస్యశ్యామలం చేయవచ్చని కేటీఆర్ వివరించారు. కానీ రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టును బద్నాం చేయాలనే కుట్రతో నీళ్లివ్వడం లేదని ఆరోపించారు. 'ఇది కాలం తెచ్చిన కరవు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరవు' అని విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలన కొనసాగితే కాంగ్రెస్‌కు 117 సీట్లు కాదు కదా... 7 సీట్లు కూడా రావని హెచ్చరించారు.

## రంగారెడ్డి జిల్లా హత్యలపై మంత్రి సీతక్క దిగ్భ్రాంతి..
# కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. బాధితులకు తక్షణం సహాయం అందించాలని, మానసిక-సామాజిక తోడ్పాటు కల్పించాలని మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులను సూచించారు.మహిళలు, పిల్లల భద్రతకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, నేరస్థులు ఎంతటి వారైనా చట్టం నుంచి తప్పించుకోలేరని సీతక్క హెచ్చరించారు. బాధితులకు పూర్తి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందని స్పష్టం చేశారు. కేసు వివరాల్లోకి వెళితే... రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం దైవాలగూడలో జరిగిన దారుణ హత్యల వెనుక పోక్సో కేసు కక్ష ఉందని పోలీసు దర్యాప్తు వెల్లడైంది. నిందితుడు రాజ్‌కుమార్ (28) తనపై పోక్సో కేసు నమోదు చేసి జైలు పంపిన బాలిక, ఆమె తల్లి, నానమ్మను కత్తితో నరికి చంపాడు. అనంతరం తన భార్య సరిత (పార్వతి సరిత), 3 ఏళ్ల కుమార్తె, 2 ఏళ్ల కుమారుడిని కూడా కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘోర ఉదంతంలో మొత్తం ఆరుగురు మృతి చెందారు. గత మే 16న బాలికను వేధించాడని ఆమె తల్లి ఫిర్యాదు చేయగా, పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి మే 26న రాజ్‌కుమార్‌ను అరెస్టు చేశారు. శుక్రవారం బెయిల్‌పై విడుదలైన వెంటనే ఈ దారుణం చేశాడని పోలీసులు తెలిపారు.

## వియత్నాం బోటు ప్రమాదంలో
# భారతీయుల మృతి... ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి

కలిసి ప్రయాణిస్తున్న స్పీడ్‌బోట్‌లో సాంకేతిక లోపం తలెత్తడంతో ఒక్కసారిగా నీటిలో మునిగిపోయింది. సమీపంలోని ఇతర పర్యాటక బోట్లు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాయి. గాయపడిన 21 మందిని రక్షించి చికిత్స కోసం సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. ఈ విషాద ఘటనపై ప్రధాని మోదీ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "వియత్నాంలోని ఫు క్వోక్ సమీపంలో భారత పౌరులతో కూడిన పడవ ప్రమాదానికి గురైన విషాద వార్త తెలిసి చాలా బాధపడ్డాను. తమ ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. అస్వస్థతకు గురైన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను" అని మోదీ పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు సహాయం అందించేందుకు భారత రాయబార కార్యాలయం, కాన్సులేట్ అధికారులు వియత్నాం అధికారులతో కలిసి పనిచేస్తున్నారని ఆయన తెలిపారు. సమాచారం కోసం హో చి మిన్ సిటీ, హనోయ్‌లలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. స్థానిక అధికారులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారని, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అధికారులు వెల్లడించారు.

## మోదీ ఎందుకు ప్రెస్ కాన్ఫరెన్స్‌లు పెట్టరు?..
# న్యూజిలాండ్ జర్నలిస్ట్ ప్రశ్న

### ప్రజలతో నేరుగా కనెక్ట్ అవ్వడమే మోదీ శైలి

జర్నలిస్ట్ అడిగిన ప్రశ్నకు విదేశాంగ అధికారి రుద్రేంద్ర టాండన్ స్పందిస్తూ.. ప్రధాని రాజకీయ వ్యూహాలను ఒక ప్రభుత్వ అధికారిగా తాను ప్రశ్నించలేనని చెప్తూనే, భారతీయ రాజకీయాల నేపథ్యాన్ని వివరించారు. 'ప్రధాని మోదీ పక్కా భారతీయ రాజకీయవేత్త. సాధారణంగా భారతీయ నాయకులు తమ ఓటర్లతో నేరుగా సంబంధాలు కలిగి ఉండటానికే ఇష్టపడతారు. మధ్యవర్తులు లేదా మీడియా ద్వారా ప్రజలతో మాట్లాడటం కంటే, నేరుగా ప్రజలకే తమ సందేశాన్ని చేరవేయాలని భావిస్తారు' అని టాండన్ పేర్కొన్నారు. ప్రధాని మోదీ ఈ 'డైరెక్ట్ కాంటాక్ట్' విధానంలో అద్భుతమైన నైపుణ్యం సాధించారని, అందువల్లే ఆయన భారతదేశంలో అత్యధిక కాలం పనిచేసిన ప్రధానులలో ఒకరిగా నిలిచారని గుర్తుచేశారు. ప్రజలు ఆయన విధానాన్ని ఆదరించబట్టే వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చారని దౌత్యవేత్త స్పష్టం చేశారు.

### నార్వేలోనూ గతంలో ఇదే తరహా ప్రశ్న

ప్రధాని మోదీ విదేశీ పర్యటనల్లో ఇలాంటి ప్రశ్నలు రావడం ఇదేం మొదటిసారి కాదు. గత మేలో నార్వే రాజధాని ఓస్లో పర్యటన సందర్భంగా కూడా అక్కడి ప్రధాని జోనాస్ గహర్ స్టోర్‌తో కలిసి మోదీ సంయుక్తంగా మీడియా ముందుకు వచ్చినప్పుడు.. హెల్ లింగ్ అనే నార్వేజియన్ జర్నలిస్ట్ ప్రధాని మోదీని ఉద్దేశించి 'మీరు జర్నలిస్టుల ప్రశ్నలకు ఎందుకు సమాధానం ఇవ్వరు?' అని బహిరంగంగా అడిగారు. అప్పట్లో ఈ అంశం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది.

## ఈ నెల 14న తెలంగాణ వ్యాప్తంగా
# కళాశాలల బంద్ కు పిలుపునిచ్చిన ఏబీవీపీ




ఈ నెల 14న రాష్ట్రవ్యాప్తంగా కళాశాలల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ఏబీవీపీ ప్రకటించింది. వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించిన ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచెర్ల రాంబాబు ఈ ప్రకటన చేశారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి చదువుకుంటున్నారని రాంబాబు తెలిపారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు విడుదల చేయకపోవడంతో రూ. 11 వేల కోట్ల బకాయిలు పేరుకుపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రతి సంవత్సరం 2 లక్షల మంది విద్యార్థులు డ్రాపౌట్ అవుతున్నారని, వేల మంది సర్టిఫికెట్లు తీసుకోలేక ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ప్రైవేట్ కాలేజీలు, ప్రభుత్వం కలిసి విద్యార్థులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ కేంద్ర కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర నాయకులు మదూరి సందీప్ రావు, జూపల్లి దీపిక, ఆరిపెల్లి సుజిత్, బెల్లం కార్తీక్, వేల్పుల రాజ్‌కుమార్, గుగులోత్ నవీన్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ కలుద్దాం సియోల్' - ముగిసిన నారా లోకేశ్ దక్షిణ కొరియా పర్యటన

మొదటి పేజి తరువాయి

నిర్వహించిన రోడ్ షోతో ముగిసింది. రాష్ట్రంతో ద్వైపాక్షిక, రాజకీయ, వాణిజ్య సహకారాన్ని బలోపేతం చేయాలనే ప్రాధాన్యతను గుర్తిస్తూ, దక్షిణ కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ మంత్రి లోకేశ్‌ను సగౌరవంగా పర్యటనకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్‌తో నిర్వహించిన భేటీల అనంతరం ఎల్జీ, హ్యుందాయ్, శాంసంగ్, బీఎన్ కే ఫైనాన్షియల్ వంటి దిగ్గజ కొరియన్ కార్పొరేట్ సంస్థలు, తమ సంస్థలతో సంప్రదించి ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న స్పష్టమైన పారిశ్రామిక విధానాలు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, అందజేస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి లోకేశ్ ఇచ్చిన ప్రజెంటేషన్‌తో వివిధ సంస్థల ప్రతినిధి బృందాలు ఫిదా అయ్యాయి. పరిశ్రమలను ఏపీకి తీసుకొచ్చేవిధంగా చొరవ : పర్యటన తొలిరోజున సియోల్‌లో భారత రాయబారి గౌరంగలాల్ దాస్తో నిర్వహించిన మర్యాదపూర్వక భేటీలో కొరియా ప్రాధాన్యతాయుత



పరిశ్రమలను ఏపీకి తీసుకొచ్చేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తూ ఆంధ్రప్రదేశ్ విజన్‌ను ఆవిష్కరించారు. దక్షిణ కొరియా ప్రముఖ వాణిజ్య కేంద్రమైన బుసాన్‌లో ఏపీఈడీబీ ఆధ్వర్యంలో అపెక్స్ కొరియా పేరిట పెట్టుబడిదారుల సహాయక, అనుసంధాన విభాగం ను ప్రారంభించడం ఆంధ్రప్రదేశ్ ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలకు నిదర్శనం. శ్రీసిటీ పరిసరాల్లో ఇప్పటికే కొలువై ఉన్న 40కి పైగా కొరియన్ కంపెనీలతో పాటు కొత్తగా వచ్చేందుకు ఆసక్తి చూపే సంస్థలకు భరోసా ఇచ్చినట్లయింది. ఆంధ్రప్రదేశ్‌లో కేవలం రెండేళ్ల వ్యవధిలో 'కియా' సాధించిన విజయాన్ని ఉదాహరణగా చూపిస్తూ, ఏపీ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు, 3ఎస్ మోడల్ (స్పీడ్, స్పెషాలిటీ, సర్వీస్), వేగవంతమైన అనుమతులపై మంత్రి లోకేశ్ వివరించిన తీరుపై కొరియా మీడియా, దిగ్గజ కంపెనీలు సానుకూలంగా స్పందించాయి. ట్విటర్ ద్వారా ధన్యవాదాలు : ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ బృందం పర్యటనపై కోట్రా దక్షిణాసియా విభాగాధిపతి క్యుంగ్‌హూన్ కిమ్ ప్రశంసల వర్షం కురిపిస్తూ, నారా లోకేశ్ బృందానికి హ్యాట్సాఫ్ అంటూ ట్విట్టర్‌లో అభినందనలు తెలపడం పర్యటన విజయవంతానికి నిదర్శనం. కొరియన్ ప్రతినిధులు మంత్రి లోకేశ్ వేగం చూసి "పల్లి పల్లి" మంత్రి అని కొత్త పేరు పెట్టారు. "పల్లి పల్లి" అనే కొరియన్ పదానికి అర్థం "త్వరగా త్వరగా" అని అర్థం. వారం రోజుల అధికారిక పర్యటనను పెట్టుబడుల యాత్రగా మార్చిన మంత్రి లోకేశ్ లౌక్యం రాష్ట్రాభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధి, కమిట్‌మెంట్‌ను తెలియజేస్తోంది.

# సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో మున్సిపల్ ఎన్నికలు

మొదటి పేజి తరువాయి

మంత్రి నారాయణ వెంట ఎమ్మెల్యే నాయకర్, ప్రజాప్రతినిధులు,అధికారులు ఉన్నారు. అనంతరం నర్సాపురం మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. గోదావరి పుష్కరాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని వ్యాఖ్యానించారు. గోదావరి పుష్కరాలకు సుమారుగా 10 కోట్ల మంది భక్తులు వస్తారని ప్రభుత్వం అంచనా వేసిందని తెలిపారు. గత పుష్కరాలకు నాలుగు కోట్ల మంది భక్తులు వచ్చారని పేర్కొన్నారు.

### రూ.150 కోట్లు మంజూరు చేశాం..

ఇప్పటివరకు మున్సిపల్ శాఖకు పుష్కర అభివృద్ధి పనుల నిమిత్తం రూ.150 కోట్లు మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. పుష్కరాలు జరిగే ప్రాంతాల్లో స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్నామని చెప్పుకొచ్చారు. త్వరలో శాఖల వారీగా పుష్కర నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. నిధులు లేకపోయినా తమ ప్రభుత్వం పుష్కరాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. రాష్ట్రంలోని పురపాలక సంఘాలకు రూ.1400 కోట్లు యుసీఎఫ్ నిధులు మంజూరు చేశామని వివరించారు. పుష్కరాల నాటికి రోడ్లు, డ్రైన్‌లు, పార్కులు పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని పేర్కొన్నారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా నర్సాపురం మున్సిపాలిటీకి రూ.34 కోట్లు కేటాయించామని ప్రస్తావించారు.

### ఆ పనులకు డీపీఆర్ సిద్ధం చేస్తున్నాం..

కేంద్రం ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే పనులు ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ఏపీకి కేంద్రం రూ.14,000 కోట్లు ఖజఖీ నిధులు కేటాయించిందని వెల్లడించారు. మరో రూ.16 కోట్లు సీఎం కేటాయించారని అన్నారు. ఈ నిధులతో ఏయే ప్రాజెక్టులు చేపట్టాలనే దానిపై డీపీఆర్ సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అమృత్ 2.0 ద్వారా రూ.125 కోట్లతో డ్రింకింగ్ వాటర్ పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. పట్టణంలో రెండు ఎస్‌టీపీలను పొల్యూషన్ కంట్రోల్




బోర్డు నిధులతో నిర్మిస్తున్నామని అన్నారు. జగన్ ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి వెళ్లిపోయిందని విమర్శించారు. అయినా సీఎం చంద్రబాబు కేంద్ర సహకారంతో అభివృద్ధి పనుల కోసం ఎక్కువ నిధులు ఖర్చు చేస్తున్నారని మంత్రి నారాయణ పేర్కొన్నారు.

## వియత్నాంలో మునిగిన భారత పర్యాటకుల బోటు
# గల్లంతైనవారిలో ఏపీ, తెలంగాణ టూరిస్టులు- 15 మంది మృతి

మొదటి పేజి తరువాయి

ప్రమాదంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన టూరిస్టులు!

ఇటీవల ఓ మొబైల్ కంపెనీ 250 మందితో కూడిన ఒక బృందాన్ని భారత్ నుంచి వియత్నాం పర్యటనకు తీసుకెళ్లింది. వీళ్లంతా మొబైల్ కంపెనీకి చెందిన డిస్ట్రిబ్యూటర్లుగా తెలుస్తోంది. అయితే ఇందులో 40 మంది తెలంగాణ, 35 మంది ఆంధ్రప్రదేశ్ కు చెందిన మొబైల్ డిస్ట్రిబ్యూటర్లు ఉన్నారు. వియత్నాం వార్తా పోర్టల్ 'ఎచీ ఎక్స్‌ప్రెస్ ఇంటర్నేషనల్' కథనం ప్రకారం, టూర్ లో భాగంగా ఇవాళ మధ్యాహ్నం మూడు బృందాలుగా విహార యాత్రకు వెళ్లారు. అందులో 32 మంది భారతీయ పర్యాటకులు, నలుగురు సిబ్బందితో ఓ స్పీడ్ బోటు 'హాన్ మే రుట్' నుంచి 'అన్ థోయ్' రేవుకు బయల్దేరింది. అయితే మార్గ మధ్యలో హాన్ మే రుట్ న్గోయ్ వద్ద తీరానికి సుమారు 400 మీటర్ల దూరంలో బోటు బోల్తా పడింది. దీంతో బోటులోని



ప్రయాణికులు సముద్రంలో మునిగిపోయారు. వెంటనే సమీపంలోని టూరిస్టు బోటు నిర్వాహకులు సహాయం కోసం అక్కడికి చేరుకున్నారని ఆ వార్తా పోర్టల్ పేర్కొంది. "వియత్నాంలోని ఫు క్వాక్ ద్వీపం సమీపంలో భారత పర్యాటకులతో వెళ్తున్న ఒక పడవ బోల్తా పడింది. ఈ ప్రమాదం అత్యంత విచారకరం. స్థానిక అధికారులు ముమ్మరంగా సహాయక చర్యలు చేపడుతున్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు, ఎంతమంది పర్యాటకులు ఉన్నారు అనే పూర్తి వివరాలను సేకరిస్తున్నాం" ----వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం

### కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు!

ఈ ప్రమాదంపై సమాచారం, సహాయం అందించేందుకు అధికారులు కంట్రోల్ రూమ్ ల ఏర్పాటు చేశారు. హనోయిలోని భారత రాయబార కార్యాలయంతోపాటు హో చి మిన్ సిటీలోని భారత కాన్సులేట్ జనరల్ ఆఫీస్ లోనూ కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. బాధితుల కుటుంబాలకు సమాచారం, సహాయం కోసం భారత దౌత్య కార్యాలయం హెల్ప్ లైన్ నెంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది.

## విమానం గాల్లో ఉండగా ఊడిన కిటికీ నుంచి కిందకు
# పడిపోతున్న ప్రయాణికుడిని కాపాడిన తోటి ప్రయాణికులు

మొదటి పేజి తరువాయి



ఐదు నిమిషాల పాటు ఆయన కాళ్లను గట్టిగా పట్టుకున్నారు" అని తెలిపారు. గ్రీస్‌లోని థెస్సలోనికి నగరం నుంచి జర్మనీలోని మెమ్మింగెన్‌కు శుక్రవారం ఉదయం బయలుదేరిన ఈ విమానం గాల్లో ప్రయాణిస్తున్నప్పుడు ఒక ప్రయాణికుడి పక్కనున్న కిటికీ ఊడిపోవడంతో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే వెనక్కి తిరిగివచ్చినట్టు ర్యాన్‌ఎయిర్ ఒక ప్రకటనలో తెలిపింది. "విమానం సాధారణంగానే ల్యాండ్ అయింది, ప్రయాణికులు టెర్మినల్‌కు చేరుకున్నారు. థెస్సలోనికిలో ఒక ప్రయాణికుడు వైద్య సహాయం కోరగా, గ్రౌండ్ సిబ్బంది సేవలు అందించారు" అని ఐరిష్ బడ్జెట్ ఎయిర్‌లైన్ పేర్కొంది. కొన్నిగంటల తర్వాత ప్రయాణికులను మెమ్మింగెన్‌కు పంపడానికి ప్రత్యామ్నాయ విమానాన్ని ఏర్పాటు చేసినట్లు కూడా తెలిపింది. ఆ ప్రయాణికుడు తల నుంచి భుజాల వరకు కిటికీ నుంచి బయటకు తలకిందులుగా వేలాడారని, ఇతర ప్రయాణికులు ఆయన్ను లోపలికి లాగారని తోటి ప్రయాణికులు స్థానిక మీడియాకు చెప్పారు. విమానం ఇంజిన్ ముక్కలు తగలడం వల్లే కిటికీ పగిలిపోయిందని విమానంలో ఉన్నవారు చెప్పారు. అయితే, ర్యాన్‌ఎయిర్ దీనిపై ఇంకా స్పందించలేదు. ప్రయాణికుడు తల నుంచి భుజాల వరకు కిటికీ నుంచి బయటకు తలకిందులుగా వేలాడారని, ఇతర ప్రయాణికులు ఆయన్ను లోపలికి లాగారని తోటి ప్రయాణికులు స్థానిక మీడియాకు చెప్పారు.

### 'తల నుంచి భుజాలవరకు కిటికీ బయట వేలాడాయి'

"విమానంలో వాయుపీడనం ఒక్కసారిగా తగ్గిపోయినట్టు వెంటనే అర్థమైంది. ప్రయాణికుల అరుపులు వినిపించాయి. ఎవరో ప్రమాదవశాత్తూ అత్యవసర తలుపు తెరిచారనుకున్నాను" అని తోటి ప్రయాణికురాలు క్రిస్టినా రేడియో థెస్సలోనికితో చెప్పారు. "ఆక్సిజన్ మాస్కులు కిందకు పడ్డాయి, ఘాటైన వాసన వచ్చింది. ఒక ప్రయాణికుడి తల, భుజాలు కిటికీ బయటకు వెళ్లిపోయాయి. అదృష్టవశాత్తూ ఆయన సీట్ బెల్ట్ తీయలేదు" అన్నారు. మరో ప్రయాణికురాలు సోఫియా రేడియో థెస్సలోనికితో మాట్లాడుతూ: "ఆక్సిజన్ మాస్కులు కిందకు పడినప్పుడు ఏం జరగబోతుందో అర్థం కాలేదు. మేం క్షేమంగా తిరిగి వెళ్తామా లేదో కూడా తెలియలేదు. మేం విమానం వెనుక భాగంలో కూర్చున్నాం, ఏదో ఒక రకమైన పేలుడు జరిగిందని అర్థమైంది" అన్నారు. "విమానం కిందకు పడిపోతోందనుకున్నాం. వాయుపీడనం తీవ్రంగా పడిపోయింది. ఊపిరి తీసుకోలేకపోతున్నట్లు అనిపించింది. గాయపడిన వ్యక్తికి రక్తస్రావం జరిగింది, ఆక్సిజన్ లేకపోవడం, షాక్ వల్ల ఆయన చాలాసార్లు స్పృహ కోల్పోయారు" అని సోఫియా వివరించారు. "బాధితుడు తీవ్ర దిగ్భ్రాంతిలో ఉన్నప్పటికీ, స్పృహలోనే ఉన్నారు" అని పాన్‌హెలెనిక్ పబ్లిక్ హాస్పిటల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు మిచాలిస్ గియానాకోస్ తెలిపారు.

### సీట్ బెల్ట్ కాపాడిందా?

సుమారు 18 ఏళ్ల నాటిదిగా భావిస్తున్న ఈ విమానాన్ని, ర్యాన్‌ఎయిర్ అనుబంధ సంస్థ అయిన 'మాల్టా ఎయిర్' నడుపుతోంది.

"ప్రస్తుతం ఈ ఘటనపై హెలెనిక్ ఎయిర్ అండ్ రైల్ సేఫ్టీ ఇన్వెస్టిగేషన్ అథారిటీ విచారణ జరుపుతోంది" అని థెస్సలోనికి విమానాశ్రయ ఆపరేటర్ 'ఫ్రాపోర్ట్ గ్రీస్' తెలిపింది. "సంబంధిత విభాగాలకు పూర్తిగా సహకరిస్తున్నాం. నిర్దేశిత అత్యవసర సహాయక చర్యలను అమలు చేశాం" అని తెలిపింది. ఈ ఘటన గురించి తెలుసని, విచారణాధికారులకు అవసరమైన సహాయాన్ని అందిస్తామని ఐరిష్ ఏవియేషన్ అథారిటీ అంతకుముందు బీబీసీకి తెలిపింది. సీట్ బెల్ట్ పెట్టుకోకపోయి ఉంటె ఈ ప్రమాదం 'ఇంకా తీవ్రంగా ఉండేదని' రిటైర్డ్ ఎయిర్‌లైన్ పైలట్ క్రిస్ బ్రాడీ బీబీసీతో చెప్పారు. "మేం బెల్ట్ సైన్ ఆఫ్ చేసినప్పటికీ, ప్రయాణికులు ముందస్తు జాగ్రత్తగా సీట్ బెల్ట్‌లు పెట్టుకునే ఉండాలని కెప్టెన్‌లుగా ఎప్పుడూ చెబుతుంటాం. ఇలాంటి ఊహించని సంఘటనలు లేదా గాల్లో వచ్చే కుదుపులను తట్టుకోవడానికే అలా చెబుతాం. కాబట్టి ప్రయాణంలో సీట్ బెల్ట్ పెట్టుకుని ఉండటం మంచి అలవాటు" అన్నారు. గతంలో 2018లో, అమెరికాలో జరిగిన ఒక సౌత్‌వెస్ట్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ ప్రమాదంలో దెబ్బతిన్న ఇంజిన్ ముక్కలు తగిలి కిటికీ పగిలిపోయింది. ఆ సమయంలో ఒక మహిళా ప్రయాణికురాలు కిటికీలోంచి సగం శరీరం బయటకు వేలాడటంతో ప్రాణాలు కోల్పోయారు.

# గ్రాండ్ గా కోల్‌కతా టూరిజం ఫెయిర్- స్పెషల్ అట్రాక్షన్‌గా రామోజీ ఫిల్మ్ సిటీ స్టాల్

టీటీఎఫ్ కోల్‌కతాలో పర్యాటకులను ఆకట్టుకున్న రామోజీ ఫిల్మ్ సిటీ స్టాల్- బాహుబలి, ఆర్ఆర్ఆర్, పుష్ప వంటి చిత్రాల సెట్లకు భారీ ఆదరణ- దసరా అండ్ దీపావళి కార్నివల్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

ఢిల్లీ : ప్రపంచంలోనే అతిపెద్ద ఫిల్మ్ సిటీగా గుర్తింపు పొందిన రామోజీ ఫిల్మ్ సిటీ (=ఖీజ) ఇప్పుడు కేవలం సినిమా షూటింగ్‌లకే పరిమితం కాకుండా సమగ్ర పర్యాటక కేంద్రంగా విస్తరిస్తోంది. కార్పొరేట్ సమావేశాలు, డెస్టినేషన్ వెడ్డింగ్స్, కుటుంబ విహారయాత్రలు, విద్యార్థుల టూర్లు, పండుగ కార్నివల్స్ వంటి విభిన్న కార్యక్రమాలకు అనువైన కేంద్రంగా రామోజీ ఫిల్మ్ సిటీని నిర్వాహకులు తీర్చిదిద్దుతున్నారు. ఈ మేరకు ఆ విషయాలను కోల్‌కతా ట్రావెల్ అండ్ టూరిజం ఫెయిర్ లో వెల్లడించారు. ఆ ప్రదర్శనలో రామోజీ ఫిల్మ్ సిటీ స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా బాహుబలి సినిమా సెట్లు, అక్కడ నిర్వహించే పండుగ కార్నివల్స్, సినిమా చిత్రీకరణల విశేషాలను ప్రతిబింబించే ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. రాజభవనాలు, యుద్ధభూములు, విదేశీ నగరాల వీధులు, అందమైన ఉద్యానవనాలు వంటి సినిమా సెట్లు ఒకేచోట ప్రత్యక్షంగా చూసే అవకాశం రామోజీ ఫిల్మ్ సిటీలో ఉంటుందని నిర్వాహకులు వివరించారు.

ఎన్నో సౌకర్యాలు- మరెన్నో సదుపాయాలు

రామోజీ ఫిల్మ్ సిటీ సీనియర్ జనరల్ మేనేజర్ తుషార్ గార్గ్ మాట్లాడుతూ, ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీ కేవలం సినిమా స్టూడియో మాత్రమే కాదని, పూర్తి స్థాయి వీ×జజు (మీటింగ్స్, ఇన్సెంటివ్స్, కాన్ఫరెన్సెస్ అండ్ ఎగ్జిబిషన్స్) కేంద్రంగా కూడా ఎదిగిందని చెప్పారు. కార్పొరేట్ సంస్థల కోసం దాదాపు 100 రకాల వేదికలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 500కు పైగా హోటల్ గదులు, 800 మందికి పైగా బస చేసే డార్మిటరీలు, చిన్న బోర్డు సమావేశాల నుంచి 10 వేల మంది పాల్గొనే భారీ కార్యక్రమాల వరకు నిర్వహించే అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయని వెల్లడించారు. కార్పొరేట్ అతిథులకు సమావేశాలతో పాటు వినోదాన్ని కలిపిన ప్రత్యేక అనుభూతిని అందిస్తున్నామని తుషార్ గార్గ్ తెలిపారు. ఉదయం సమావేశాలు, మధ్యాహ్నం థీమ్ ప్రాంతాల్లో వినోద కార్యక్రమాలు, 'సాహస్' అడ్వెంచర్ పార్క్‌లో టీమ్ బిల్డింగ్ కార్యక్రమాలు, సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు, సంగీత కార్యక్రమాలు, డీజే నైట్స్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అనంతరం మరుసటి రోజు మొత్తం ఫిల్మ్ సిటీని సందర్శించే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు. ఇటీవల ఎడ్ షీరన్, ఏఆర్ రెహమాన్ సంగీత కచేరీల వంటి అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని, ఒక్కో కార్యక్రమానికి దాదాపు 15 వేల మంది హాజరయ్యారని తెలిపారు.

రామోజీ ఫిల్మ్ సిటీ స్టాల్ వద్ద సందర్శకులు

ఎంగేజ్మెంట్ నుంచి పెళ్లి వరకు!

వివాహాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని డెస్టినేషన్ వెడ్డింగ్స్‌కు కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని తుషార్ గార్గ్ వెల్లడించారు. 'సగాయి టు బిదాయి' అనే కాన్సెప్ట్‌తో నిశ్చితార్థం నుంచి పెళ్లి ముగిసే వరకు జరిగే అన్ని కార్యక్రమాలను ఒకేచోట నిర్వహించే అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. రాజభవనం నేపథ్యంలోని వివాహాలు, పచ్చని లాన్‌లలో రిసెప్షన్లు, సంగీత్, మెహందీ వంటి వేడుకలకు ప్రత్యేక వేదికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అతిథుల కోసం ఫైవ్ స్టార్ 'సితార', ఫోర్ స్టార్ 'తారా', 'శాంతినికేతన్', 'గ్రీన్స్ ఇన్'తో పాటు ఇతర వసతి సౌకర్యాలు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.రామోజీ ఫిల్మ్ సిటీ టూరిజం జనరల్ మేనేజర్ సూరజ్ సిన్హా మాట్లాడుతూ, ఇప్పటివరకు 3,500కు పైగా చిత్రాల షూటింగ్‌లు ఇక్కడ జరిగాయని తెలిపారు. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్', 'కల్కి', 'పుష్ప', 'సూర్యవంశం' వంటి పలు విజయవంతమైన చిత్రాల చిత్రీకరణ ఇక్కడే జరిగినట్లు చెప్పారు. అందువల్ల సందర్శకులు సినిమా సెట్ల మధ్య నడుస్తున్న అనుభూతిని పొందుతారని పేర్కొన్నారు. దుర్గాపూజ సెలవులను పురస్కరించుకుని అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు ప్రత్యేకంగా 'దసరా-దీపావళి కార్నివల్' నిర్వహిస్తున్నట్లు సూరజ్ సిన్హా వెల్లడించారు.

బంగాల్ ప్రజలకు బెస్ట్ సెలక్షన్

ఆ నెల మొత్తం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఫిల్మ్ సిటీ సందర్శకులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్నివల్ పరేడ్, లైవ్ మ్యూజిక్ ఈవెంట్స్, నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక అలంకరణలు, రోజంతా వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. చిన్నారుల కోసం 'ఫండుస్థాన్ 'తో పాటు అనేక ప్రత్యేక ఆకర్షణలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. బంగాల్ కు చెందిన కుటుంబాలు దుర్గాపూజ సెలవుల్లో విహారయాత్రకు రావడానికి రామోజీ ఫిల్మ్ సిటీ ఉత్తమ ఎంపికగా నిలుస్తుందని సూరజ్ సిన్హా అభిప్రాయపడ్డారు. ఫై స్టార్ హోటళ్ల నుంచి ఫోర్ స్టార్ హోటళ్లు, బడ్జెట్ హోటళ్లు, ప్రీమియం విల్లాలు, గ్లాంపింగ్ టెంట్లు వరకు వివిధ రకాల వసతి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కుటుంబాలు, స్నేహితుల బృందాలు, పెద్ద సమూహాలు తమ బడ్జెట్‌కు అనుగుణంగా వసతి ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. హైదరాబాద్‌కు రెండు లేదా మూడు రోజుల పర్యటనకు వచ్చే పర్యాటకులు ఒక రోజు రామోజీ ఫిల్మ్ సిటీని సందర్శించి, మిగిలిన సమయంలో హైదరాబాద్‌లోని ఇతర ప్రముఖ పర్యాటక ప్రాంతాలను కూడా వీక్షించవచ్చని ఆయన సూచించారు. టీటీఎఫ్‌లో రామోజీ ఫిల్మ్ సిటీ స్టాల్‌ను బంగాల్ మంత్రి దిలీప్ ఘోష్ సతీమణి రింకూ ఘోష్ సందర్శించారు. 'బాహుబలి' వంటి చిత్రాల విజయంతో

# సంపాదకీయం

## ఇంటా బయటా పితృస్వామ్య బంధనాలే!

'చైతన్య స్రవంతి' కథన పద్ధతికి పథ నిర్దేశంచేసిన ఆంగ్ల రచయిత్రి వర్జీనియా వూల్ఫ్ 1929లో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో విద్యార్థినుల నుద్దేశించి ఒక సుప్రసిద్ధ ప్రసంగాన్ని వెలువరించారు. సాహిత్య ప్రపంచం ఇప్పటికీ ఉటంకించే ఆ ప్రసంగంలో ఆంగ్ల సాహిత్య చరిత్రలో పురుష రచయితల ప్రాబల్యాన్ని గురించి ఆమె ప్రధానంగా ప్రస్తావించారు. పురుష రచయితల ప్రాముఖ్యానికి కారణం జెండర్ వివక్షేనని అభిప్రాయపడ్డారు. సమాజ నిర్మాణం, స్వభావరీతుల్లో ఆ వివక్ష అంతర్లీనంగా ఉందని ఆమె పేర్కొన్నారు. పురుష రచయితల సాహిత్య సృజనలు వర్ధిల్లుతున్న విధంగా మహిళలు సృష్టించే సాహిత్య కృతులు సువిఖ్యాతమవ్వాలంటే రచయిత్రులకు రాజకీయ, ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని వాదించారు. 'ఒక మహిళకు ధనరాశులు, సాహిత్య సృజనకు ఆమెకు ఒక సొంత గది ఉండితీరాలని' వర్జీనియా వూల్ఫ్ సుప్రసిద్ధంగా ఉద్ఘాటించారు. ఆర్థిక భద్రత, సామాజిక హోదా ఉన్న ఉన్నత వంశ సంజాతురాలు వర్జీనియా. వాటితో పాటు తనకున్న అద్భుత అనుకూలతల గురించి ఆమె చెప్పలేదు. తనను ప్రగాఢంగా ప్రేమించే లియోనార్డ్ వూల్ఫ్ ఆమెకు 'దైవమిచ్చిన భర్త'. తన భార్య తనకంటే అనంతంగా ప్రతిభావంతురాలు అని గుర్తించి ఆమె సృజనాత్మక సామర్థ్యాలు సమగ్రంగా వికసించేందుకు సంపూర్ణ సహాయ సహకారాలు అందించిన వివేకశీలి లియోనార్డ్ వూల్ఫ్. అయితే వర్జీనియాను బైపోలార్ డిప్రెషన్ (తీవ్రమైన, నిరాశాజనకమైన మానసిక స్థితి) నుంచి విముక్తం చేయడంలో ఆ ఉదార హృదయుడు విఫలమయ్యాడు. పట్టి పీడిస్తున్న ఆ మానసిక వ్యాధి మూలంగా వర్జీనియా 1941లో ఆత్మహత్య చేసుకున్నారు. తన భర్తకు వదిలివెళ్లిన వీడ్కోలు సందేశంలో వర్జీనియా ఇలా రాశారు: 'నా విషయంలో మీరు ఓర్పు చూపారు. నన్ను అపురూపంగా చూసుకున్నారు. ఒక భర్తగా, తోటి మనిషిగా మీరు చేయగలిగిన దాని కంటే అత్యుత్తమంగా ప్రతి విషయంలోనూ వ్యవహరించారు. నా ఆశలన్నీ హరించుకుపోయాయి, నా మనసు శూన్యమైపోయింది. అయితే మీ మంచితనాన్ని విస్మరించలేను. మీరు ఎంత ఉత్తమ స్వభావులు అనే విషయంలో నాకు ఇప్పటికీ పరిపూర్ణ నమ్మకం ఉన్నది'. హిందీ రచయిత్రి మన్నూ భండారి స్వీయ చరిత్ర 'ఏక్ కహానీ యే భీ' ఆంగ్లానువాదం 'దిస్ టూ ఈజ్ ఏ స్టోరీ' (ఇది కూడా ఒక కథే)ను చదివినప్పుడు వర్జీనియా వూల్ఫ్ అంతిమ మాటలు, లియోనార్డ్‌తో ఆమె వైవాహిక జీవితమూ గుర్తుకువచ్చాయి. మన్నూ తండ్రి విద్వజ్జుడు, తల్లి ఉత్తమ గృహిణి. తనకు హిందీ సాహిత్యాన్ని బోధించిన శీలా అగర్వాల్ చదవడానికి పుస్తకాలు ఇచ్చి, ఆ తరువాత వాటి గురించి తనతో చర్చించేవారని మన్నూ రాశారు. ఆమె గురించి ఇంకా ఇలా రాశారు: 'శీలాజీ నాకు ధైర్యాన్నిచ్చారు, నాలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. జీవితంలో ఒక దిశానిర్దేశం చేశారు. నా జీవితానికొక అర్థాన్ని కల్పించారు'. మన్నూ భండారి తన స్వీయచరిత్రలో సాహిత్య జీవితం గురించి విశేష శ్రద్ధాసక్తులతో రాశారు. తాను రాసిన నవలలు, కథలు; రచనా శైలులు, రచయితల కలహాలు, విరోధాలు; రచయితల బృందాలు, ముఠాలు వాటి వైనాలు; సాహిత్య జీవితంలో దార్శనిక సంపాదకుల, సాహిత్య పత్రికల పాత్ర తదితర అంశాలను వివరంగా ప్రస్తావించారు. 'మై హార్ గయా' (నేను ఓడిపోయాను) అన్న తన తొలి కథ ఒక పత్రికలో ప్రచురితమయినప్పుడు తాను ఎంతగానో పులకించిపోయానని మన్నూ రాశారు. అటువంటి పులకింపు మరెప్పుడూ జీవితంలో ఎన్నో ముఖ్యమైన సంఘటనల సందర్భాలలో కూడా తనకు కలగలేదని మన్నూ గుర్తు చేసుకున్నారు. మన్నూ స్వీయచరిత్రలో కొన్ని భాగాలు సాహిత్య, సాహిత్య చరిత్ర విద్యార్థులకు విశేష ఆసక్తి కలిగిస్తాయి. ఇతర భాగాలు ముఖ్యంగా తన వైవాహిక జీవితం గురించిన ఆమె కథనాలు విస్తృతంగా ఆసక్తికరమైనవి. భారతీయ పితృస్వామ్య వ్యవస్థపై ఆమె నిర్మొహమాటంగా వెలుగులు ప్రసరించారు. కలకత్తాలో ఉన్నప్పుడు మన్నూకు సాహిత్య ప్రతిభాశాలి రాజేంద్ర యాదవ్‌తో పరిచయమయింది. ఆ పరిచయం ప్రేమగా పరిణమించింది. ఆ ప్రేమ వివాహంగా రూపుదాల్చింది. భార్యాభర్తలు అయిన కొద్ది కాలానికే ఇరువురూ ఇక నుంచి సమాంతర జీవితాలు గడుపుదామని రాజేంద్ర ఆమెకు స్పష్టం చేశాడు. 'ఒకే ఇంటిలో ఉంటున్నప్పటికీ మనం మన సొంత బతుకులు బతుకుదాం.. ఒకరి జీవితంలో మరొకరు జోక్యం చేసుకోకుండా స్వతంత్రంగా, స్వేచ్ఛగా వేర్వేరుగా జీవిద్దాం అని రాజేంద్ర నిర్దేశించాడు. మన్నూ నుంచి వీలైనంత ఎక్కువ సమయం తన పురుష స్నేహితులతో ఉబుసుపోక కబుర్లు చెప్పుకునేందుకు లేదా ఇతర మహిళలతో ప్రేమాయణాలు సాగించేందుకే రాజేంద్ర ప్రాధాన్యమిచ్చేవాడు. మన్నూతో వైవాహిక బంధం తెగిపోయే వరకు రాజేంద్ర అనేకానేక ప్రేమాయణాలలో కొనసాగాడు. తన సంసార జీవితం రాజేంద్ర అబద్ధాలు, వంచనలతో గడిచిందని మన్నూ రాశారు. కలకత్తాలో పదేళ్ల కాపురం అనంతరం ఇరువురూ హిందీ సాహిత్య జగత్తుకు కేంద్రమైన ఢిల్లీకి మారారు. ఢిల్లీ జీవితంలోనే ఇరువురూ తమ సుప్రసిద్ధమైన కథలు, నవలలు రాశారు. ప్రముఖ సాహిత్య పత్రిక 'హన్స్'కు రాజేంద్ర ఎడిటర్ అయిన తరువాత యువ రచయితలు, రచయిత్రులు సదా ఆయన చుట్టూ పరివేష్టితమై ఉండేవారు. సాహిత్య సమాలోచనలతో మునిగి తేలుతుండేవారు. అయితే వారెప్పుడూ మన్నూకు ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని ఇవ్వలేదు. ఆమె ఇవ్వగలిగేది ప్రేమాభిమానాలు మాత్రమే కదా. ఇది ఆమెకు పెద్దగా మనస్తాపం కలిగించకపోయినప్పటికీ రాజేంద్ర కుటుంబ బాధ్యతలను నిర్లక్ష్యం చేయడం ఆమెను బాగా చికాకుపరిచేది. తాను అనారోగ్యం పాలయినప్పుడు, చివరకు తమ బిడ్డ ఆరోగ్యంగా లేనప్పుడు సైతం రాజేంద్ర తమను ఏ మాత్రం పట్టించుకునేవాడు కాదని మన్నూ రాశారు. ఆ రోజుల గురించి ఆమె ఇంకా ఇలా గుర్తుచేసుకున్నారు

## ఎల్‌నినోతో కరవు తప్పదా?



ఇది సూపర్ ఎల్‌నినో సంవత్సరమనే భావన సమాచార మాధ్యమాల ద్వారా ప్రజల్లో నాటుకుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావం అసాధారణంగా ఉండవచ్చని అంటూనే, అధికారికంగా 'సూపర్' అనే వర్ణనను స్వీకరించలేదు. ఈ ఏడాది మిగిలిన కాలంలో ఎల్‌నినో తన ప్రభావాన్ని 90శాతం వరకు కొనసాగించే అవకాశముందని ప్రపంచ వాతావరణ సంస్థ అంచనా వేసింది. ప్రతి రెండు నుంచి ఏడేళ్లకు ఒకసారి సంభవించే ఎల్‌నినో భారీ వర్షాలు, కరవులు, ఉష్ణ ప్రకోపం వంటి వాటిని ప్రేరేపిస్తుంది. మానవ కార్యకలాపాలతో కర్బన ఉద్గారాలు కట్టుతప్పడంతో భూగోళంపై ఇప్పటికే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎల్‌నినో సముద్రం నుంచి వాతావరణానికి ఉష్ణశక్తిని మరింతగా బదిలీ చేయడం ద్వారా, ఆ వేడిని ఇంకా పెంచుతుంది. తత్ఫలితంగా 2027లో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావచ్చు. 'సూపర్ ఎల్‌నినో' వల్ల మధ్య, తూర్పు పసిఫిక్ సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సగటు కంటే రెండు డిగ్రీల సెంటీగ్రేడ్, లేదా అంతకంటే ఎక్కువ పెరుగుతాయి. దానివల్ల ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన కరవులు, వరదలు, ఉష్ణోగ్రతలు ఏర్పడతాయి. కాబట్టి దీనికి 'సూపర్' అనే పేరు వచ్చింది. దీనివల్ల తరచూ తక్కువ వర్షపాతం, తీవ్రమైన వేడిగాలులు వంటివి సంభవిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఇది ఆహార ధాన్యాల ప్రధాన ఎగుమతి ప్రాంతాల్లో కరవులను ప్రేరేపించడం, పంట దిగుబడులను తగ్గించడం ద్వారా వ్యవసాయ సరఫరా గొలుసులను దెబ్బతీస్తుంది, ఆహార ద్రవ్యోల్బణాన్ని పెంచుతుంది.

### అనూహ్య పరిస్థితుల్లో అనర్థాల ముప్పు

భారతదేశంలో సూపర్ ఎల్‌నినో నైరుతి రుతుపవనాలను బలహీనపరిచే అవకాశం ఉంది. ఇది జలాశయాల్లో నీటిమట్టాలను తెగ్గోసి వ్యవసాయ దిగుబడులను తగ్గిస్తుంది. జూన్ నెలకు సంబంధించి భారతదేశంలో మొత్తం రుతుపవన వర్షాల లోటు దాదాపు 40శాతంగా నమోదైంది. మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ వంటి అనేక ప్రాంతాలు 75 నుంచి 85శాతం వరకు లోటును ఎదుర్కొంటున్నాయి. సాధారణంగా, వ్యాపార పవనాలు వెచ్చని నీటిని పశ్చిమ పసిఫిక్ వైపు నెడతాయి. సూపర్ ఎల్‌నినో సమయంలో, ఆ పవనాలు గణనీయంగా బలహీనపడతాయి లేదా వెనక్కి మళ్లుతాయి. దానివల్ల వేడినీరు పెద్దయెత్తున ఉత్తర, దక్షిణ అమెరికా ఖండాల వైపు ప్రవహిస్తుంది. ఆ వెచ్చని నీరు తుపాను వ్యవస్థలను తూర్పు వైపునకు మారుస్తుంది. మానవ కార్యకలాపాల వల్ల భూగోళం వేడెక్కిన పరిస్థితుల్లో సంభవిస్తున్న సూపర్ ఎల్‌నినో ఉష్ణశక్తిని మరింత పెంచుతుంది. హిందూ మహాసముద్రంలో ఏర్పడే ద్విధ్రువత (ఐవోడీ), పసిఫిక్‌లో పుట్టే ఎల్‌నినో ప్రపంచ వాతావరణానికి రెండు ప్రధాన చోదకాలుగా పనిచేస్తాయి. ఈ రెండూ కొన్నిసార్లు కరవులు, భారీ వర్షపాతం వంటి వాతావరణ వైరుధ్యాలను పెంచుతాయి, మరికొన్నిసార్లు తగ్గిస్తాయి. ఐవోడీ సానుకూలంగా ఉంటే ఆఫ్రికా తీరం సమీపంలోని పశ్చిమ హిందూ మహాసముద్రం వేడెక్కుతుంది. తూర్పు వైపు (ఇండోనేసియా, ఆస్ట్రేలియా సమీపంలో) చల్లబడుతుంది. ఈ ద్విధ్రువత సాధారణంగా తేమతో కూడిన గాలులను భారత ఉపఖండం వైపు లాగుతుంది. అందువల్ల తరచుగా సాధారణం కంటే ఎక్కువ రుతుపవన వర్షపాతం సంభవిస్తుంది. ప్రతికూల ఐవోడీ ఏర్పడితే, తూర్పు హిందూ మహాసముద్రం పశ్చిమం కంటే వేడిగా మారుతుంది. వర్షపాతాన్ని ఇండోనేసియా, ఆస్ట్రేలియా వైపు మళ్లించి, భారత రుతుపవనాలను బలహీనపరిచే ప్రమాదముంది. ఎల్‌నినో సాధారణంగా ఐవోడీ కంటే శక్తిమంతమైనది కాబట్టి, ఐవోడీ దాని ప్రభావాలను పాక్షికంగా మాత్రమే సమతుల్యం చేయగలదు. ఈ రెండూ ఏకకాలంలో సంభవించినప్పుడు, ఫలితం ఒక క్లిష్టమైన పెనుగులాటగా మారుతుంది. ఈ సంవత్సరం వర్షపాత లోటు 60శాతం వరకు ఉంటుందని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ లోటు దేశ వ్యవసాయ రంగాన్ని, భూగర్భ జల నిల్వలను, నదులను, నీటిపారుదలను తీవ్రంగా ప్రభావితం చేసే అవకాశం ఉంది. జూన్ 2023 నుంచి ఏప్రిల్ 2024 వరకు కొనసాగిన ఎల్‌నినో, అసలే మండిపోతున్న భూమిని మరింత వేడెక్కించింది. ఫలితంగా పారిస్ ఒప్పందం నిర్దేశించిన 1.5డిగ్రీల సెంటీగ్రేడ్ పరిమితిని దాటిన తొలి సంవత్సరంగా 2024 నిలిచింది. ప్రస్తుత ఎల్‌నినో వచ్చే ఏడాది ప్రపంచ ఉష్ణోగ్రతలను మరింత పెంచడానికి సిద్ధంగా ఉంది. ఐరోపాను కల్లోలపరుస్తున్న అధిక వేడిమి వాతావరణ మార్పుల తీవ్రతను నేడు అనుభవంలోకి తెస్తోంది. దాని ధాటికి అక్కడ 1300 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు.

### చరిత్రలో విషాద జ్ఞాపకాలు


ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల్లో 1875–77లో దారుణమైన కరవు సంభవించడానికి ఎల్‌నినోయే కారణం. ఆ కరవు ఇండియా, చైనా, ఈజిప్ట్, మొరాకో, ఇథియోపియా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్, కొలంబియా, వెనెజువెలా దేశాలపై తీవ్ర ప్రభావం చూపి, అయిదు కోట్లకంటే ఎక్కువమందిని బలిగొంది. భారతదేశంలో సుమారు 56 నుంచి 96 లక్షల మంది మరణించారు. ఆ కరవు మద్రాస్, బొంబాయి ప్రెసిడెన్సీలను, మైసూర్, హైదరాబాద్ సంస్థానాలను కుదిపేసింది. 1877 నాటికి, అది ఉత్తర దిశగా సెంట్రల్, నార్త్–వెస్టన్ ప్రావిన్సులు, పంజాబ్‌కు వ్యాపించి తీవ్రమైన పోషకాహార లోపం, కలరా, మశూచి వ్యాప్తికి దారితీసింది. ఆ వ్యాధులు కరవుకు అత్యంత ఘోరమైన సావాసులుగా మారాయి. బ్రిటిష్ వలసవాద ఆర్థిక విధానాల వల్ల ఆ సంక్షోభం మరింత తీవ్రమైంది. వలస పాలకులు స్థానికుల మనుగడ కంటే నిరంతర ధాన్య ఎగుమతులకు, స్వేచ్ఛా మార్కెట్లకు ప్రాధాన్యమిచ్చారు. ఆఫ్రికన్ జనాభాలో విజృంభించిన ఆకలి– ఉత్తర ఆఫ్రికాలో ఫ్రెంచ్ వలసవాద విస్తరణకు అనుకూల పరిస్థితులను సృష్టించింది. 1876–78 నాటి ఎల్‌నినోయే 'సంపన్న, తృతీయ (వర్ధమాన) ప్రపంచం' అనే విభజనకు అనుకూల పరిస్థితులను కల్పించింది. ఆధునిక యుగంలో ఎల్‌నినో తెచ్చిపెట్టే కరవును ఎదుర్కోవడానికి ప్రపంచ దేశాలు పరస్పరం సహకరించుకోవాలి. కరవును తట్టుకునే విత్తనాలను పంచుకోవడం, నీటి నిల్వలను సంరక్షించుకోవడం, ముందస్తు హెచ్చరిక డేటాను సమన్వయం చేసుకోవడం తదితరాలపై దృష్టి సారించాలి.

## మనం భారతీయ పౌరులమేనా?




దేశంలోని ప్రజలకు ప్రభుత్వం ఇండియన్ సిటిజన్ కార్డులు జారీ చేయాలి. ఆ కార్డు ద్వారానే ఓటు హక్కును, పౌరసత్వ గుర్తింపును కలిగించాలి. లేకపోతే ప్రజలు తమ వద్ద ఉన్న వివిధ కార్డులను తాయెత్తుల్లా వేలాడదీసుకొని తిరగాల్సి వస్తుంది. చివరికి ఆ కార్డులన్నీ పౌరసత్వానికి సంబంధంలేని ప్లాస్టిక్ ముక్కలేనని పాలకులు చెప్తారు. డబ్బు తొమ్మిదేండ్ల స్వాతంత్ర్య భారతదేశంలో ఇప్పుడు ప్రజలకు ఒక సమస్య వెంటాడుతున్నది. ఏటా గణతంత్ర దినోత్సవం సందర్భంగా మన పాలకులు జాతిని ఉద్దేశించి ఆత్మవిశ్వాసంతో కూడిన ప్రసంగాలు ఇస్తుంటారు. ప్రజలందరినీ దేశంతో అనుసంధానించేందుకు గాను, కోట్లాది రూపాయల వ్యయంతో జారీ చేసిన డిజిటల్ గుర్తింపు కార్డుల గురించి చెప్తూ ఉంటారు. కానీ నేడు ఆ గుర్తింపు అంశమే ప్రశ్నార్థకంగా మారింది. ప్రస్తుతం దేశంలో పౌరుల వద్ద ఉన్న గుర్తింపు కార్డులు, ఆ పత్రాలు వర్షంలో కొట్టుకొనిపోయే చిత్తు కాగితాల వంటివనే భావన నెలకొన్నది. దేశవ్యాప్తంగా ఇప్పుడు ఇదే చర్చ తీవ్రరూపు దాల్చింది. వివరాల్లోకి వెళ్తే ఏడాది క్రితం బాంబే హైకోర్ట్ ఓ తీర్పు వెలువరించింది. చొరబాటుదారుడైన ఓ నిందితుడి బెయిల్‌ను తిరస్కరిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఆధార్, పాన్, ఓటర్ కార్డులకు, పౌరసత్వానికి సంబంధం లేదని తేల్చిచెప్పింది. సుప్రీంకోర్ట్ కూడా ఆధార్ విషయంలో ఇలాంటి తీర్పునే వెలువరించింది. అప్పట్నుంచే దేశ ప్రజల్లో పౌరసత్వంపై ఒక ఆందోళన మొదలైంది. భారతీయులు అని గుర్తింపుగా చెప్పుకోవడానికి, ఏది ఆధారం అనే ప్రశ్న ప్రజలను వెంటాడుతున్నది. తాజాగా పాస్‌పోర్ట్ సేవా దివస్ సందర్భంగా విదేశాంగశాఖ చేసిన ప్రకటన మరింత ఆందోళనకు కారణమైంది. పాస్‌పోర్ట్ కేవలం ప్రయాణపత్రం మాత్రమేనని, దానిని పౌరసత్వ గుర్తింపుగా పరిగణనలోకి తీసుకోలేమని విదేశాంగశాఖ తేల్చిచెప్పింది. ప్రభుత్వ ప్రకటనలో ఆంతర్యం, అంతరార్థం స్పష్టమవుతున్నది. దేశంలో ప్రజలు పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల వద్ద బారులుతీరి, బయోమెట్రిక్ వివరాలు సమర్పించి, పాస్‌పోర్ట్ పొందుతున్నారు. తాము భారతీయులుగా, దేశంలో తమకు ఓ స్థానం ఉందంటూ సగర్వంగా విదేశాలకు వెళ్తున్నారు. కానీ విదేశాంగశాఖ ప్రకటన చూస్తే, ఆ పాస్‌పోర్ట్ పౌరసత్వానికి గుర్తింపుగా పరిగణించలేమని చెప్తున్నారు. మరోవైపు ఆసక్తికరమైన అంశమేంటంటే భారత పౌరులకు పాస్‌పోర్ట్ జారీ చేస్తామని పాస్‌పోర్ట్ చట్టం పీఠికలో స్పష్టంగా పేర్కొని ఉన్నది. చట్టంలోని ప్రారంభ వ్యాఖ్యలు, చట్టం ఉద్దేశాన్ని తేల్చిచెప్పడం, నిర్వివాదాంశం. అయినప్పటికీ పౌరసత్వానికి పాస్‌పోర్ట్‌ను గుర్తింపుగా పరిగణించలేమని భారత పౌరులకు విదేశాంగశాఖ చెప్తున్నది. ఓ వైపు ఆధార్, పాన్ కార్డులు పౌరసత్వానికి గుర్తింపులు కాదని కోర్టులు చెప్పగా, దేశ ప్రజలు అత్యంత గొప్పదిగా భావించే పాస్‌పోర్ట్ కూడా ఆ ప్లాస్టిక్, డిజిటల్ టోకెన్లు, ఆధారాలకు సంబంధించిన డొల్ల పత్రాల కుప్పలా మారిపోయింది. కేంద్ర ప్రభుత్వం వివిధ దేశాల రాజధానుల్లో రాయబార కార్యాలయంలో అధికారులను నియమించినప్పుడు, వారికి దౌత్య పాస్‌పోర్ట్‌లను జారీ చేస్తుంది. ఇందుకోసం వారి పాస్‌పోర్ట్‌లను ప్రాతిపదికగా పరిగణిస్తుంది. విదేశీ ప్రభుత్వాలు కూడా ఈ పాస్‌పోర్ట్‌లను గుర్తింపు కార్డులుగా పరిగణనలోకి తీసుకుంటున్నాయి. భారత పౌరసత్వాన్ని నిరూపించుకోవడానికి ఇతర పత్రాలను అడగవు. అంటే కేంద్రం ఆచరిస్తున్న విధానాలకు, చేస్తున్న ప్రకటనలకు మధ్య వైరుధ్యం కనిపిస్తున్నది. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారు. భారతీయ పౌరులేనని నిరూపించుకోవడానికి ఓటర్ గుర్తింపు కార్డును ఆధారంగా సమర్పిస్తారు. అంతేకానీ ప్రత్యేకంగా పౌరసత్వ గుర్తింపు కార్డులను ఎవరూ అడగరు, వారు కూడా సమర్పించరు. మరి భారత పౌరసత్వానికి ఓటర్ గుర్తింపు కార్డ్, పాస్‌పోర్ట్ గుర్తింపు కార్డులు కావని చెప్తున్నారు. మరి ఎన్నికయిన ప్రజాప్రతినిధులు దేశం తరఫున మాట్లాడటానికి, చట్టాలను రూపొందించడానికి ఎలా అర్హులవుతారు? ప్రభుత్వం పాలకుల విషయంలో మాట్లాడకుండా పౌరుల నుంచి మాత్రం రుజువులు కోరుతున్నది. ప్రభుత్వం పౌరుల పట్ల అనుమానాస్పద దృష్టితో చూడటం సరికాదని విపక్ష నేతలు, విమర్శకులు మండిపడుతున్నారు. దేశ ప్రజలతో కేంద్రం ప్రమాదకరమైన ఆట ఆడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఓటరు జాబితా సవరణ పట్ల ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో పౌరసత్వంపైనే ప్రశ్నలు వ్యక్తం చేయడం ద్వారా ప్రజల ప్రతిస్పందనను అడ్డుకొనేందుకు విదేశాంగశాఖ జోక్యం చేసుకొన్నట్టుగా కనిపిస్తున్నదని విపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు పౌరసత్వ గుర్తింపునకు సంబంధించిన ప్రకటన విదేశాంగశాఖ నుంచి కాకుండా, హోంశాఖ నుంచి వెలువడితే బాగుండేదని ప్రభుత్వంలోని కొందరు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఏది ఏమైనా పౌరసత్వానికి గుర్తింపు ఏది? ఈ గందరగోళం ఎందుకు? అని ప్రజలు మండిపడుతున్నారు. దేశంలో కేవలం 2.5 శాతం మంది మాత్రమే పాస్‌పోర్ట్‌లను కలిగి ఉన్నారు. మరోవైపు బయోమెట్రిక్ అనుసంధానంగా కేంద్రం జారీ చేసిన ఆధార్ కార్డుల కోసం రూ.12,000 కోట్లకు పైగా ఖర్చు చేసింది. ఇప్పుడు బ్యాంకింగ్, పన్నుల చెల్లింపు, ప్రయాణాలకు ఆధార్ తప్పనిసరి. అయినప్పటికీ పౌరసత్వం విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు, ఆధార్ వ్యవస్థ అసంబద్ధమైనదని కొట్టిపారేస్తున్నారు. మరోవైపు పదేండ్లకోసారి ప్రభుత్వం పౌరుల పట్టిక (సిటిజన్ ఆఫ్ రిజిస్టర్) 2011తర్వాత రూపొందించలేదు. ఎవరైనా భారతీయ విద్యార్థులు, ఉద్యోగులు విదేశాల్లో ఉద్యోగానికి దరఖాస్తు చేస్తే వారి పాస్‌పోర్ట్ ప్రాతిపదికగా భారతీయులు అని నిర్ధారిస్తారు. మరి ఇప్పుడు కేంద్ర ప్రభుత్వమే పాస్‌పోర్ట్‌ను పౌరసత్వానికి ప్రాతిపదికగా చూడలేమని అంటున్నది. ఇలాంటి నేపథ్యంలో విదేశాల్లోని అధికారులు, కంపెనీలు అదనపు పత్రాలను సమర్పించాల్సిందిగా భారతీయులను కోరే పరిస్థితి ఏర్పడవచ్చు. దేశంలో నెలకొన్న రాజకీయ ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రజల్లో అస్పష్టతను కలిగించడం కోసమే పౌరసత్వం అంశాన్ని పాలకులు తెరపైకి తెచ్చినట్టుగా కనిపిస్తున్నది. అయితే, ఈ సమస్యను పరిష్కరించాలి. అమెరికా, జర్మనీ తరహాలో పౌరసత్వ చట్టం కింద జాతీయత, ఓటు హక్కు కోసం ఒకే గుర్తింపు కార్డు జారీ చేయాలి. ఈ సమస్యను చాలా దేశాలు ఎప్పుడో పరిష్కరించుకొన్నాయి. భారత్‌లోనూ పౌరసత్వ గుర్తింపు కార్డు పట్ల పాలకులు దృష్టి పెట్టాలి. లేకపోతే ఇప్పటివరకు ఉన్న కార్డులను తాయెత్తుల్లా వేలాడదీసుకొన్నా ఉపయోగం లేదు. పత్రాలన్నీ చిత్తుకాగితాలతో సమానంగా భావించాల్సి ఉంటుంది. 79 ఏండ్ల స్వాతంత్ర్య భారతంలో ఎవరు పౌరులు? అనే ప్రశ్నకు సమాధానం లేదు. ప్రస్తుతానికి నేను ఓటర్‌ను, ఇక భవిష్యత్తు సంగతి తెలియదు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆపేసే ఎత్తుగడ



నిరుపేద, వెనుకబడిన వర్గాల పిల్లలకు ఉన్నత విద్యను చేరువ చేయడంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అత్యంత కీలకమైనది. ఒకరకంగా చెప్పాలంటే ఈ పథకం ప్రారంభించిన తర్వాతే పెద్ద సంఖ్యలో పేద పిల్లలకు ఉన్నత విద్య చేరువైంది. అంతటి గొప్ప పథకానికి రేవంత్ సర్కార్ మెల్లగా తూట్లు పొడుస్తున్నది. కాలేజీలు అక్రమాలకు పాల్పడుతున్నాయని, జవాబుదారీతనం లోపించిందని సాకులు చెప్పి విద్యార్థులే కళాశాలలకు ఫీజు చెల్లించేలా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా జీవోను తీసుకొచ్చింది. విద్యార్థులకు ప్రభుత్వం డబ్బులిస్తుందని, ఆ డబ్బులను పిల్లలు కాలేజీలో కట్టాలని ఆ జీవో సారాంశం. తద్వారా, లేని విద్యార్థులు ఉన్నట్టు చూపిస్తున్న పలు కాలేజీల అక్రమాలకు చెక్ పెట్టవచ్చునని, విద్యార్థులే చెల్లింపులు చేయడం ద్వారా తల్లిదండ్రులకు కళాశాలల్లో మౌలిక వసతులపై ప్రశ్నించే హక్కు పెరుగుతుందని సర్కార్ వాదన. పాలక పెద్దలు కాగితాల మీద వింత వాదనలతో సమర్థించుకుంటున్నా జీవో అమల్లో మాత్రం విద్యార్థులకు సంకటంగా మారే అవకాశం ఉన్నది. కొత్త నిబంధనల ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తాన్ని ప్రభుత్వం నేరుగా విద్యార్థుల ఖాతాల్లో వేస్తామని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్న వివరాల ప్రకారం విద్యార్థుల ఖాతాలో డబ్బులు పడిన 7 పనిదినాల్లోగా విద్యార్థులు ఆ మొత్తాన్ని సంబంధిత కళాశాలలకు చెల్లించాల్సి ఉంటుంది. అలా చెల్లించని విద్యార్థులపై కాలేజీలు రెవెన్యూ రికవరీ చట్టం కింద చర్యలు తీసుకునే అవకాశాన్ని ఈ జీవోతో కల్పించారు. చదువుకునే విద్యార్థులను నేరస్తులుగా చూసేలా ఈ నిబంధన తేవడం రేవంత్‌రెడ్డికి తెలంగాణలోని పేదపిల్లల పట్ల ఉన్న చిన్నచూపునకు స్పష్టమైన నిదర్శనం. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేసే పరిస్థితులే ఉంటే ఏ ఇబ్బందీ లేదు. కానీ వాస్తవంలో అలా ఉన్నదా? ఇప్పటికే వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. బకాయిల కోసం కాలేజీలు ప్రభుత్వం మీద, ఫీజులు చెల్లించాలని విద్యార్థుల మీద ఒత్తిడి తెస్తున్నాయి. విద్యార్థులకు పరీక్షలకు ముందు హాల్‌టికెట్లు, ఉత్తీర్ణులైన తర్వాత సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీల యాజమాన్యాలు వేధిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల నుంచి బలవంతంగా ఫీజులు వసూలు చేసుకోవడానికి కాలేజీలకు కొత్త జీవో.. ఓ ఆయుధంగా మారే ప్రమాదం ఉన్నది. ప్రభుత్వం కొత్త జీవో ప్రకారం.. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేసే వరకు కాలేజీలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయవద్దని ఆదేశాలు జారీ చేసింది. కాలేజీలు అలా ఆగేందుకు సిద్ధపడే పరిస్థితే ఉంటే.. బకాయిల గురించి ఇంత గొడవ ఎందుకు జరుగుతుంది? అందుకే ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ నిధులు ఇవ్వకుండా, మరోవైపు, విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేసుకోనివ్వకుండా చేస్తే తాము కాలేజీలను ఎలా నడుపాలని పేర్కొన్నాయి. హైకోర్టు కూడా ఈ వాదనను సమర్థించింది. విద్యార్థుల నుంచి కాలేజీలు ముందస్తుగా ఫీజులు వసూలు చేయకూడదన్న ప్రభుత్వ నిబంధనలపై స్టే విధించింది. సర్కార్ డబ్బులు ఇవ్వకపోతే, విద్యార్థులు ఫీజులు కట్టకపోతే కాలేజీలు ఎలా నడుస్తాయని రాష్ట్ర ప్రభుత్వాన్నే ఎదురు ప్రశ్నించింది. కోర్టు ఆదేశాలను కాదని, కాలేజీలు ఫీజులు అడగకూడదంటూ ప్రభుత్వం జీవోలు జారీ చేయడం కోర్టు ధిక్కరణ కిందకే వస్తుందని కూడా ధర్మాసనం హెచ్చరించింది. హైకోర్టు ఆదేశాల్లోని అంతరార్థం ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయాలి. కానీ, ప్రభుత్వం, కాలేజీలు దీనిని అర్థం చేసుకుంటాయా? ప్రభుత్వం సమయానుసారం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేస్తుందా..? అంటే ఆ ఉద్దేశం ఉన్నట్టు కనిపించడం లేదు. అంతిమంగా హైకోర్టు ఆదేశాలను అడ్డుపెట్టుకొని కాలేజీలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేస్తాయి. అయితే, ఒకవేళ విద్యార్థుల నుంచి ముందే ఫీజులను వసూలు చేస్తే .. ప్రభుత్వం నిధులు విడుదల చేశాక విద్యార్థులకు వారి డబ్బులు వారికి తిరిగి ఇవ్వాలన్న నిబంధన ఉన్నది. కానీ, కాలేజీలు అంత ఈజీగా డబ్బులు చెల్లిస్తాయా? ముందే ఫీజు కట్టాలనడం పేదలపై భారం మోపడం కాదా? రీయింబర్స్‌మెంట్ నిధులు ఎలాగైనా విద్యార్థుల ఖాతాల్లోకే వస్తాయి కనుక ముందే ఫీజులు చెల్లించాలని ఇప్పటికే కాలేజీలు పట్టుబడుతున్నాయి. ఇక దీంట్లో మరో కోణం కూడా దాగి ఉన్నది. పేద కుటుంబాల విద్యార్థుల ఖాతాల్లో ఒక్కసారిగా వేల రూపాయల ఫీజు జమ అయితే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలు వారం రోజుల్లోపు మళ్లీ సర్దుబాటు చేయవచ్చు, ఆ డబ్బును సొంత అవసరాల కోసం వాడుకోవచ్చు.

## ఓటర్ల సందేహాలకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సమాధానాలు




పుట్టపర్తి(: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియపై ఓటర్లలో ఉన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేసేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ శనివారం కలెక్టరేట్‌లో ప్రత్యేక ఫోన్-ఇన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఓటర్లు ఫోన్ ద్వారా అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ వివరంగా సమాధానాలు ఇచ్చారు. ఎన్యూమరేషన్ ఫారాల నింపే విధానం, 2002 ఓటర్ల జాబితా వివరాల పరిశీలన, బీఎల్ఓలను సంప్రదించే విధానం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారి ఓటు నమోదు వంటి అంశాలపై స్పష్టత ఇచ్చారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే జిల్లా యంత్రాంగం లక్ష్యమని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఓటర్లు తమ పేర్లు, వివరాలను పరిశీలించుకుని అవసరమైన సవరణలు చేసుకోవాలని సూచించారు.

## సచివాలయాల్లో ఎస్ఐఆర్ సర్వేను
# తనిఖీ చేసిన కలెక్టర్ శ్యాం ప్రసాద్



పుట్టపర్తి : శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ శనివారం పుట్టపర్తి పట్టణంలోని 6, 7వ వార్డు సచివాలయాలతో పాటు ఎనుములపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఐఆర్-2026 ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సర్వే పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే రికార్డులు, ఎన్యూమరేషన్ ఫారాలు, ఓటర్ల వివరాల నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బీఎల్ఓలు బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సేవలను సకాలంలో అందించాలని, విధుల్లో అలసత్వాన్ని సహించేది లేదని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో మున్సిపల్ కమిషనర్ జి. శ్రీనివాసులు, ఆర్డీఓ సువర్ణ, సచివాలయ సిబ్బంది, బీఎల్ఓలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## లేపాక్షి సీపీఐ రాజకీయ
## శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి




నల్లమాడ : ఈ నెల 27, 28, 29 తేదీల్లో లేపాక్షిలో నిర్వహించనున్న సీపీఐ శ్రీ సత్యసాయి జిల్లా రాజకీయ, సైద్ధాంతిక శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని సీపీఐ నల్లమడ మండల కార్యదర్శి వలిపి వెంకటరమణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర పిలుపునిచ్చారు. నల్లమడ మండల కేంద్రంలో శనివారం శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమల పేరుతో రైతుల నుంచి సేకరించిన భూముల్లో వెంటనే పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, లేకుంటే ఆ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా కాలువల్లోని కంపచెట్లను తొలగించి, శ్రీ సత్యసాయి జిల్లాలోని చెరువులకు నీరు అందించాలని కోరారు. ఎస్ఐఆర్ ఓటరు ప్రక్రియలో అర్హులైన ఓటర్లను తొలగించకుండా తగిన సమయం ఇవ్వాలని, వలస వెళ్లిన నిజమైన ఓటర్ల వివరాలను పరిశీలించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో జిల్లాలో ప్రజా సమస్యలపై బలమైన ఉద్యమాలు చేపట్టేందుకు ఈ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగేంద్ర, గంగాద్రి, రూప్లా నాయక్, కేసప్ప, చెన్నయ్య, నాగరాజు, గంగన్న, వెంకటరామప్ప తదితరులు పాల్గొన్నారు.

## పుట్టపర్తిలో ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన ర్యాలీ



పుట్టపర్తి : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శనివారం పుట్టపర్తిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ, జననాల మధ్య సరైన విరామం, మాతాశిశు ఆరోగ్యం, మహిళల సాధికారత, బాలికల విద్యపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. "పిల్లల మధ్య సరైన ఎడం ఆరోగ్యకరమైన కుటుంబానికి ఆధారం" అనే సందేశాన్ని ప్రతి కుటుంబానికి చేరవేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందిస్తున్న కుటుంబ నియంత్రణ సేవలను అర్హులైన దంపతులు సద్వినియోగం చేసుకోవాలని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్. ఫైరోజా బేగం ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొని ప్లకార్డులతో ప్రజలకు అవగాహన కల్పించారు.

## ఆశ వర్కర్ల డిమాండ్లపై ఈ నెల 31న కలెక్టరేట్ వద్ద ధర్నా



పుట్టపర్తి : ఈనెల 31న రాష్ట్రవ్యాప్తంగా ఆశ వర్కర్ల డిమాండ్ల సా ధన కోసం కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ ఆశా వర్కర్ల యూనియన్ ప్రతినిధులు శ్రీ సత్యసాయి జిల్లా వైద్యాధికారి ఫిరోజా బేగం కు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వారు శనివారం డి ఎం అండ్ హెచ్ ఓ ఫిరోజబేగంను ఈనెల 31న నిర్వహిస్తున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం గురించి సమ్మె నోటీసులు అందజేశారు. స్కీమ్ వర్కర్స్ కీ, ఆశా కార్యకర్తల కు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, 2026 మార్చి 5వ తేదీ న రాష్ట్ర వైద్య శాఖ మంత్రి, అధికారులు తో జరిగిన ఒప్పందాలకు సర్కులర్స్, జీవో లు ఇవ్వాలని ఇతర న్యాయయమైన సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న ధర్నాలో జిల్లాలోని ఆశా వర్కర్స్ అందరూ పాల్గొంటామని డి ఎం అండ్ హెచ్ ఓ ఫైరోజ్ బేగం కు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా గౌరవ అధ్యక్షులు బి.సాంబశివ, జిల్లా ప్రధాన కార్యదర్శి సౌభాగ్య, జిల్లా నాయకులు చెన్నకృష్ణమ్మ, అంజినమ్మ, రమాదేవి, మమత, రాజమ్మ, అమృత తదితరులు పాల్గొన్నారు.

# భారత్ బంజారా జాగృతి సంకల్ప యాత్ర ప్రారంభం

### అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సేవాగడ్ పీఠాధిపతి శ్రీ మహారాజ్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్




గుత్తి, జూలై 11 **(దిక్సూచి ప్రతినిధి):** : గుత్తి సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ సేవాగడ్ లో భారత్ బంజారా జాగృతి సంకల్ప యాత్ర"లిను బంజార గిరిజన సమైక్య (దీ+టా )జాతీయ అధ్యక్షుడు మహేష్ బంజారా, సంత్ శ్రీ సేవాలాల్ బంజారా సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రాము నాయక్, శ్రీ ఆంజనేయ స్వామి ఆశ్రమం పీఠాధిపతి తిప్పేస్వామి నాయక్ (స్వామి) ఆధ్వర్యంలో శనివారం ఘనంగా



ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాగడ్ పీఠాధిపతి శ్రీ మహారాజ్ కు వ్యతిరేకంగా సేవాగడ్ నుంచి దేశవ్యాప్తంగా పర్యటించి ఢిల్లీలో 27వ తేదీ వరకు ఈ యాత్ర ద్వారా జరుపుతున్నామని తెలియజేశారు. మొన్నటి రోజు శ్రీ మహారాజ్ చేపడుతున్న యాత్ర సమాజ ప్రయోజనాల కోసం కాదని, వ్యక్తిగత స్వలాభం కోసం ప్రారంభించారని, తను పేరు కూడా సరైన పేరు కాదని వివిధ ప్రాంతాలలో ఒకచోట రమేష్ అని మరోచోట యువరాజ్, అని ఇక్కడ శ్రీ మహారాజ్ అని అనేక అవినీతి ఆరోపణలు అతనిపై ఉన్నాయని ఆరోపించారు. వాటికి సంబంధించిన అంశాలు పలు మీడియా కథనాల్లో కూడా వెలువడ్డాయని పేర్కొన్నారు. ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి సేవాగడ్ పీఠాధిపతిగా కొనసాగడం సముచితం కాదని, వెంటనే ఆయనను ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సేవాగడ్ పీఠం ప్రతిష్ఠకు భంగం కలిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే, సేవాగడ్‌ను పరిరక్షించేందుకు ప్రతి బంజారా సోదరుడు ముందుకు రావాలని, తమ సంకల్ప యాత్రకు మద్దతు తెలిపి సమాజ ప్రయోజనాల కోసం ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సేవా గాడ్ ట్రస్ట్ సభ్యులు ,బంజారా యువ నాయకులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బంజారా సంఘాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొన్నారు.

# ఇథనాల్ సమస్యలు ఇన్నిన్ని కాదయా.. ఒక సమస్యకు పరిష్కారం




సమస్యను మించిన చిక్కులు తెస్తే ఏమవుతుంది? ప్రస్తుతం ఇథనాల్ సమస్య అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నది. పెట్రోల్ కొరతకు ప్రత్యామ్నాయంగా కేంద్రం పంటల ఆధారిత ఇథనాల్‌ను ముందుకు తెచ్చింది. ప్రపంచంలోని కొన్ని ఇతర దేశాలు కూడా ఇథనాల్ బాట పట్టాయి. యుద్ధాల వల్ల, ఇతరేతర ఉద్రిక్తతల వల్ల పెట్రోలియం దిగుమతులు ఇబ్బందిగా మారడం కొత్తకాదు. భారత్ తన చమురు అవసరాల్లో కొంచెం అటూఇటుగా 90 శాతం వరకు దిగుమతులపైనే ఆధారపడుతున్నది.ఎవష్ట్రఅఎశ్రీవ ఖీబవశ్రీం & ాబఎతీఅఖ్షుత్ం మనదేశ దిగుమతి వ్యయంలో పెట్రోలియం సింహభాగం ఆక్రమిస్తున్నది. ముడిచమురు దిగుమతి కోసం మన దేశం నెలవారీగా 15.4 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నది. ఈ తరహా సమస్యలు అన్నిటికీ తక్షణ పరిష్కారం ఇథనాల్ ఒక్కటేనని కేంద్ర సర్కార్ ప్రచారం చేస్తున్నది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలుపాలని సూచిస్తున్నది. తర్వాత ఈ నిష్పత్తిని క్రమంగా పెంచి ఈ-100 పేరిట పూర్తిస్థాయి వాహన ఇంధనంగా ఉపయోగంలోకి తేవాలనే ఆలోచన కూడా ఉన్నది. ప్రయోగాత్మకంగా దేశమంతటా ఈ-20 పేరిట అమలు చేశారు. దీని ఫలితాలు ఆశాజనకంగా లేవు.ఈ-20తోనే దశం ఇంకా సతమతం అవుతుంటే కేంద్రం ఇప్పుడు ఈ-85ని రంగం మీదికి తెచ్చింది. ప్రస్తుతం దేశంలో 48 ఔట్‌లెట్స్‌లో ఇది అందుబాటులో ఉన్నది. ఈ ఏడాది చివరి నాటికి వీటి సంఖ్య 500కు, వచ్చే ఏడాది 5 వేలకు పెంచాలనేది ఆలోచన. చాలా దేశాలు వాహన కాలుష్యం నివారణకు క్రమంగా విద్యుత్తు బ్యాటరీల వైపు మళ్లుతుంటే ఇండియా మాత్రం ఇంకా సంప్రదాయిక ఇంధనాల్లో ఇథనాల్ చేర్పు మార్గాన్ని ఎంచుకోవడం భిన్నంగానే కనిపిస్తున్నది. ఇథనాల్ అదనంగా ఉత్పత్తి అయ్యే మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌కే మిశ్రమ ఇంధనాన్ని పరిమితం చేయవచ్చుననే సూచనలు కూడా ఉన్నాయి. దేశం ఎదుర్కొంటున్న చమురు సమస్యకు ఇథనాల్ దివ్యౌషధం లాంటిదని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అంటున్నారు. కానీ వాహనదారులు దానిని అంగీకరించలేకపోతున్నారు. ఇథనాల్ ఇంధనంపై దేశ ప్రజల్లో క్రమంగా పెరుగుతున్న వ్యతిరేకతకు గత ఆదివారం ఢిల్లీలో పెద్దఎత్తున జరిగిన నిరసనలు అద్దంపట్టాయి. ఈ వ్యతిరేకతకు ప్రధానంగా రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి.. ఇథనాల్ మిశ్రమం వల్ల మైలేజీ బాగా తగ్గడం, రెండు..ఇంజిన్ త్వరగా పాడైపోవడం. ఇది కొత్తరకం ఇంజిన్ కలిగిన వాహనాలకు మాత్రమే పరిమితం. పాత వాహనాల విషయంలో ఫలితాలు మరింత ఘోరంగా ఉన్నాయని అంటున్నారు. ఈ-20 పెట్రోల్‌తో తమకు ఉపయోగం లేదని, పైగా నష్టం ఎక్కువని 53 శాతం వాహనదారులు అభిప్రాయపడుతున్నట్టు లోకల్ సర్కిల్స్ సంస్థ నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. 10 శాతం మైలేజీ తగ్గిందని 66 శాతం మంది వాపోగా, రిపేర్ ఖర్చులు భారీగా పెరిగాయని 42 శాతం మంది చెప్పడం గమనార్హం. ఇథనాల్ కోసం కార్ల నమూనాలోనూ మార్పులు చేయాల్సి వస్తుంది. ఈపాటికే మారుతి సంస్థ ఒకటి రెండు ఇథనాల్ అనుకూల వ్యాగన్-ఆర్ మాడల్ రిలీజ్ చేసింది. కొన్ని సైకిల్ మోటర్ కంపెనీలు కూడా ఆ దిశగా కసరత్తు జరుపుతున్నాయి.ప్రభుత్వాలు ఇంధన భద్రత, కార్బన్ తగ్గింపు లక్ష్యాలకు ఇథనాల్‌ను దివ్యమైనదని ప్రశంసిస్తుండగా, వినియోగదారుల వాహన ఆరోగ్యం, ఆహార లభ్యత, నిజమైన పర్యావరణ సుస్థిరతపై దాని నిగూఢమైన దుష్ప్రభావాలను విమర్శకులు ఎత్తిచూపుతున్నారు. ఇథనాల్‌కు నీటిని ఆకర్షించే గుణం ఉన్నది. దీనివల్ల ఇంధన పైపులు తుప్పుపట్టడం, ఫ్యూయల్ ఇంజెక్టర్లు మూసుకుపోవడం, పాత ఇంజిన్లు వేగంగా చెడిపోవడం జరుగుతున్నది. పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్‌లో సుమారు 30% తక్కువ శక్తి ఉంటుంది. దీనివల్ల ఖర్చు దాదాపు సమానంగా ఉన్నప్పటికీ ప్రతి గ్యాలన్‌కూ మైలేజీలో గణనీయమైన తగ్గుదల కనిపిస్తున్నది. ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా తలెత్తిన నిరసనల నేపథ్యంలో ప్రభుత్వం ఆత్మరక్షణలో పడింది. మిశ్రమ ఇంధనం కేవలం ప్రయోగాత్మక దశలోనే ఉన్నదని సంజాయిషీ ఇచ్చుకున్నది. ఇథనాల్ తయారీకి మానవ జనాభాకు ఆహారం అందించాల్సిన లక్షలాది హెక్టార్ల వ్యవసాయ భూమిని మళ్లిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భారీ మొత్తంలో ఆహారంగా పనికివచ్చే మక్కజొన్న (అమెరికాలో), చెరుకు (బ్రెజిల్, భారతదేశంలో), నూకల బియ్యం లేదా మక్కజొన్న కూడా నేరుగా ఇంధనం తయారీకి వినియోగిస్తున్నారు. ఇదంతా అనివార్యంగా ఇంధన విధానాలు, ఆహార భద్రత మధ్య పోటీగా పరిణమిస్తున్నది. దీనివల్ల ఊహించిన విధంగానే ప్రపంచ ఆహార ధరలు పెరుగుతాయి. కరువు లేదా పంట కొరతల సమయంలో, ఆహార భద్రత కంటే పారిశ్రామిక ఇంధనానికి ప్రాధాన్యత ఇవ్వడం తీవ్రమైన ప్రతికూలతలను సృష్టిస్తుంది. భారీ సాగుకోసం ఇంధనం, వరి, చెరుకు వంటి పంటలకు అపారమైన నీటిని వినియోగించడం కార్బన్ న్యూట్రల్ లక్ష్యాలను అస్థిరం చేస్తాయని పర్యావరణవాదులు అంటున్నారు. మరోవైపు భూమి వినియోగం పెరుగడం సమస్య ఎటూ ఉంటుంది. ఇథనాల్ కార్బన్ మోనాక్సైడ్‌ను తగ్గిస్తున్నట్టు భారతీయ వాహన పరీక్షల్లో వెల్లడైనప్పటికీ, పట్టణ పొగమంచు, వాయు కాలుష్యానికి ప్రధాన కారణాలైన నైట్రస్ ఆక్సైడ్‌లను అది తగ్గించలేదని తేలింది. ఇలా లాబీల కోసం దేశ ఇంధన, పర్యావరణ, వ్యవసాయ భద్రతను పణంగా పెట్టేందుకు బదులుగా ఇథనాల్ ఉపయోగంపై పునఃపరిశీలన జరుపడం ఎంతైనా అవసరం.

## న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలి
## రాష్ట్ర కన్వీనర్ సాకే నరేష్ డిమాండ్



అనంతపురం :ప్రభుత్వం న్యాయవాదుల వినతులను దృష్టిలో పెట్టుకొని రక్షణ చట్టం చేయాలని బిసి న్యాయవాదుల సంఘం రాష్ట్ర కన్వీనర్ సాకే నరేష్ డిమాండ్ చేశారు. శనివారం బిసి న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ సాకే నరేష్ మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో న్యాయవాదులపై అనుచితంగా దాడులు జరుగుతున్నాయి. క్లయింట్ రూపంలో కొద్దిమంది తమకు నచ్చని, తమకు వ్యతిరేకంగా ఏదైన కేసు వేస్తే దాడులు చేస్తున్నారు. కొంత పొలిటికల్ గా కూడా దాడులు జరుగుతున్నాయి. పోలీస్ వ్యవస్థలో కూడా వీటికి సరైన స్పందన లభించడం లేదు. ప్రభుత్వం న్యాయవాదుల వినతులను దృష్టిలో పెట్టుకొని రక్షణ చట్టం చేయాలని బిసి న్యాయవాదుల సంఘం డిమాండ్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామాంజినేయులు, ప్రధాన కార్యదర్శి అశోక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి కిశోర్, ట్రెజరర్ మహేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టపర్తిలో ప్రశాంత
## వాతావరణమే లక్ష్యం: అర్బన్ సీఐ యువరాజు



పుట్టపర్తి : ఆధ్యాత్మిక క్షేత్రమైన పుట్టపర్తిలో శాంతిభద్రతలను మరింత బలోపేతం చేసి, భక్తులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని అర్బన్ సీఐ యువరాజు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 31 మందిపై కేసులు నమోదు చేసి రూ.31 వేల జరిమానా విధించినట్లు వెల్లడించారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపిన నలుగురికి కోర్టు ద్వారా రూ.40 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. బహిరంగ మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం, పేకాట, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పుట్టపర్తిలో వాహన తనిఖీలు, రాత్రి గస్తీ, డ్రోన్ కెమెరాలతో నిఘా, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతున్నాయని తెలిపారు. భక్తులు, పర్యాటకులు, స్థానిక ప్రజల భద్రతకు పోలీసులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ యువరాజు కోరారు.

Printed , Published and Owned by POLAGONI ALIVELU, and Printed at Smilys Online, 6-7-48, Vanasthalipuram, Shopping Complex, Rangareddy-500070. Telangana State and Published from 17-10-25, Plot No.H.No. 4-136/12, Turkayamjal Journalist Colony, Rangareddy501510, Telangana State. Editor: POLAGONI ALIVELU. PRGI No. TGTEL/25/A3190. Phone No: +91 7989151815